# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 340, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) శనివారం - 22 - ఫిబ్రవరి - 2025


## ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రవేశపెట్టే

# తొలి పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే..?

**ఆశల పద్దుకు వేళాయే.. ఈనెల 28న పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న కూటమి ప్రభుత్వం**

**కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెడుతున్న తొలి పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే**

**రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు**

**ఈ నెల 28న చట్ట సభలకు బడ్జెట్‌ను సమర్పించనున్నారు**

**ఈనెల 25న గవర్నర్ ప్రసంగంపై చర్చ ఉండనుంది**



అమరావతి : ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఈనెల 24న ప్రారంభం కానున్నాయి. 28వ తేదీన ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెడుతున్న తొలి పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే. ఏపీ అభివృద్ధిలో ఈ బడ్జెట్ కీలక పాత్ర పోషిస్తుందని నేతలు చెబుతున్నారు.

ఏపీ బడ్జెట్

రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నెల 28న చట్ట సభలకు బడ్జెట్‌ను సమర్పించనున్నారు. పయ్యావుల కేశవ్ శాసనసభలో బడ్జెట్ ప్రవేశపడతారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రవేశపెట్టే తొలి పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే కావడంతో.. ప్రజల్లో ఆసక్తి నెలకొంది. ఉభయ సభల సమావేశం ప్రారంభం సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తారు. ఈనెల 25న గవర్నర్ ప్రసంగంపై చర్చ ఉండనుంది.

వనరుల సమీకరణపై ఫోకస్..

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, మేనిఫెస్టోలో చెప్పిన పథకాల అమలు కోసం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించనున్నట్టు తెలుస్తోంది. ఇందుకోసం వనరుల సమీకరణపై ఆర్థిక శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. బడ్జెట్ రూపకల్పనపై మిగతా..2లో



### మోదీ, అమిత్ షాకు

## మిథున్ రెడ్డి లేఖ

- జగన్ ప్రాణాలకు ముప్పు ఉంది
- జగన్ మిర్చి యార్డు పర్యటన సందర్భంగా భద్రతా వైఫల్యం కనిపించిందన్న మిథున్ రెడ్డి
- జగన్ నివాసం వద్ద కూడా కొన్ని ఘటనలు కనిపించాయన్న వైసీపీ ఎంపీ
- కేంద్ర బలగాలతో జగన్ కు భద్రత కల్పించాలని విన్నపం

## ఇన్నేళ్లు ఏం చేశారో చూసుకోవాలి

**ప్రభుత్వం ఏర్పడి ఒక్కరోజు కూడా కాలేదు**

**అతిషికి ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా కౌంటర్**

**ఒకరోజు కూడా గడవకముందే ప్రభుత్వంపై విమర్శలేమిటని ప్రశ్న**

**తొలి కేబినెట్ సమావేశంలో ఆయుష్మాన్ భారత్‌ను అందుబాటులోకి తెచ్చామన్న ముఖ్యమంత్రి**



ఢిల్లీ: మా ప్రభుత్వం ఏర్పడి ఒక్కరోజు కూడా గడవలేదని, కానీ అప్పుడే విమర్శలు చేస్తున్నారని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా మండిపడ్డారు. కాంగ్రెస్ 15 ఏళ్లు, ఆమ్ ఆద్మీ పార్టీ 13 ఏళ్లు ఢిల్లీని పాలించాయని, ఇన్నేళ్లు ఏం చేశారో చూసుకోవాలని హితవు పలికారు. కానీ తాము పీఠం ఎక్కి ఒకరోజు కూడా కాలేదు, తమపై విమర్శలు చేయడమేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మొదటి రోజే తాము మిగతా..2లో



## కేసీఆర్ అలా చేయకపోయి ఉంటే చంద్రబాబుతో పంచాయితీ ఉండకపోయేది

హైదరాబాద్: కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఇప్పుడు చంద్రబాబుతో పంచాయితీ ఉండకపోయేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రగతి భవన్‌లో జగన్‌ను అధికార లాంఛనాలతో ఆహ్వానించి, పంచభక్ష పరమాన్నం పెట్టారని విమర్శించారు. రాయలసీమ ఎత్తిపోతల ద్వారా తెలంగాణ జల దోపిడీకి అక్కడే అంకురార్పణ జరిగిందని ఆరోపించారు. "ఈ పాపం మీది కాదా కేసీఆర్" అని ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర రెడ్డి చెప్పులు మోసింది, ఊడిగం చేసింది కేసీఆర్ కాదా అన్నారు. నారాయణపేట జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, లక్ష కోట్ల రూపాయలతో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన కేసీఆర్ వేల కోట్ల రూపాయలు మింగారని ఆరోపించారు. లక్ష కోట్ల రూపాయలు మిగతా..2లో

## 'మద్దతు ధర ఆలోచన అప్పుడే ఎందుకు చేయలేదు?'



వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మిర్చి రైతులను పరామర్శించే వరకూ మీరు స్పందించ లేదంటే ఏమనుకోవాలి

'కేంద్ర మంత్రి ఢిల్లీ లో లేనప్పుడు మిర్చి రైతుల కోసం చర్చించడానికి వెళుతున్నామని చెప్పడం ఎంత వరకు సమంజసం



## గ్రూప్-2 అభ్యర్థుల పరిస్థితిని పట్టించుకోరా?: షర్మిల

- గ్రూప్-2 మెయిన్స్ అభ్యర్థుల ఆందోళనలపై షర్మిల స్పందన
- రోస్టర్ విధానంలో తప్పులు సరిదిద్దాలంటూ అభ్యర్థుల డిమాండ్
- ఏపీపీఎస్సీ మొండిగా వ్యవహరించాల్సిన అవసరం ఏమొచ్చిందన్న షర్మిల





## అతడి కథ ఒక స్ఫూర్తిదాయక జీవిత పాఠం

- శ్రీకాకుళం నుంచి హైదరాబాద్ వలసవెళ్లిన వ్యక్తి
- వెదురుబుట్టలు, విసనకర్రలు తయారు చేసి అమ్ముతూ ఉపాధి
- హ్యూమన్స్ ఆఫ్ హైదరాబాద్ పోస్టును షేర్ చేసిన చంద్రబాబు

## మోదీజీ.. అది వ్యక్తిగత అంశం కాదు



అది దేశప్రయోజనాలకు సంబంధించిన విషయం"

అదానీ గ్రూప్‌పై అమెరికాలో పెట్టిన కేసు గురించి ట్రంప్‌తో భేటీ సమయంలో చర్చకు వచ్చిందా..?

2

## 'భారత ఎన్నికల్లో అమెరికా జోక్యం"..

ట్రంప్ వ్యాఖ్యలపై కేంద్రం స్పందన..

"అమెరికా కార్యకలాపాలు మరియు నిధులకు సంబంధించి అమెరికా పరిపాలన విడుదల చేసిన సమాచారాన్ని మేము చూశాం

భారతదేశ అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యం గురించి ఆందోళనలకు దారితీసింది"



2

## ఢిల్లీ నూతన సీఎం కార్యాలయంలో ఇప్పటికీ కేజ్రీవాల్ ముద్ర!

ఢిల్లీ సీఎం కార్యాలయంలో భగత్ సింగ్, అంబేద్కర్ ఫొటోలు

ఆ ఇద్దరి నుంచి తానెంతో ప్రేరణ పొందానని అప్పట్లో కేజ్రీ ప్రకటన

కొత్త సీఎం కార్యాలయంలో కూడా అంబేద్కర్, భగత్ సింగ్ ఫొటోలు



## కేసీఆర్ పై హైకోర్టులో పిటిషన్

**కేసీఆర్ పై పిటిషన్ వేసిన విజయ్ పాల్ రెడ్డి**

**అసెంబ్లీకి రాకపోతే వేటు వేయాలని పిటిషన్**

**కేసీఆర్ అసెంబ్లీకి రాకున్నా స్పీకర్ ఎలాంటి ప్రొసీడింగ్స్ చేపట్టలేదని విమర్శ**



హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలయింది. గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన కేసీఆర్... అసెంబ్లీకి రాకపోతే చర్యలు తీసుకోవాలని పిటిషనర్ కోరారు. ఫార్మర్స్ ఫెడరేషన్ కు చెందిన విజయ్ పాల్ రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ప్రజల పక్షాన అసెంబ్లీలో మిగతా..2లో





## పవన్ కల్యాణ్ పై అనుచిత పోస్టు.. కేసు నమోదు

ఇటీవల కుంభమేళాకు వెళ్లిన పవన్ కల్యాణ్ భార్య, కుమారుడితో కలిసి పుణ్యస్నానం చేసిన పవన్

మరో నటుడు సంపూర్ణేశ్ బాబుతో పోలుస్తూ హర్షవర్ధన్ రెడ్డి అనే వ్యక్తి పోస్ట్

### పదేళ్ల పాలనపై.. కేసీఆర్, కిషన్‌రెడ్డి

# చర్చకు సిద్ధమా?

**నారాయణపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన**

- గత పాలకులు పాలమూరు జిల్లాను పట్టించుకోలేదు
- "పదేళ్ల పాటు ఏగ్రామంలో పేదలకు ప్రభుత్వ ఇళ్లు దక్కలేదు
- ఏటా మహిళలకు అలాంటి రెండు చీరలు ఇస్తాం: రేవంత్ రెడ్డి
- ఆడపడుచు వస్తే ఎలాంటి చీర పెడతామో అలాంటి నాణ్యత కలిగిన చీర ఇస్తామన్న సీఎం





నారాయణపేట: గత పాలకులు పాలమూరు జిల్లాను పట్టించుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. "పదేళ్ల పాటు ఏగ్రామంలో పేదలకు ప్రభుత్వ ఇళ్లు దక్కలేదు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించింది. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదు. అంతకు ముందు ఎంపీగా గెలిపిస్తే.. ఏ నాడూ పాలమూరు గురించి పార్లమెంట్లో ప్రస్తావించలేదు. తెలంగాణ సాధించుకున్న తర్వాత కూడా ఈ జిల్లాకు న్యాయం జరగలేదు. గతంలో కొందరు సీఎంలు పాలమూరు పేరు చెప్పి రాజకీయం చేశారు కానీ, జిల్లాకు చేసిందేమీ లేదు. భీమ, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, సంగంబండం, కల్వకుర్తి ప్రాజెక్టుల పదేళ్లలో ఎందుకు పూర్తి చేయలేదు. పదేళ్లలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే ఇవాళ చంద్రబాబుతో పంచాయితీ ఉండేది కాదు. వైఎస్ఆర్, జగన్ పోతిరెడ్డిపాడు ద్వారా కృష్ణా నీళ్లు రాయలసీమకు మిగతా..2లో

### ఎల్ఆర్ఎస్ పేరుతో 50కోట్ల

## దోపిడీకి కాంగ్రెస్ ప్లాన్

- ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామని డబ్బులు వసూలు చేస్తారా?
- కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే కేంద్ర బడ్జెట్‌పై చర్చకు రావాలి
- కాంగ్రెస్ పార్టీ బర్త్, డెత్ రెగ్యులరైజేషన్ స్కీంలను కూడా ప్రవేశపెడతారేమో



పెద్దపల్లి: తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామని డబ్బులు వసూలు చేస్తారా? అని ప్రశ్నించారు. ఇదే సమయంలో కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే కేంద్ర బడ్జెట్‌పై చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్రమంత్రి బండి సంజయ్ పెద్దపల్లి జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఎల్ఆర్ఎస్ పేరుతో రూ.50వేల కోట్ల దోపిడీకి కాంగ్రెస్ ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామని ఇప్పుడు డబ్బులు వసూలు చేస్తారా?. ఎన్నికల సమయంలో మీరు ఇచ్చిన హామీ ఇదే(ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామని కాంగ్రెస్ నేతలు మాట్లాడిన వీడియో). ఇప్పుడు ఎందుకు మాట మార్చుతున్నారు?. కాంగ్రెస్ పార్టీ బర్త్, డెత్ రెగ్యులరైజేషన్ స్కీంలను కూడా ప్రవేశపెడతారేమో అంటూ ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో కేంద్ర బడ్జెట్‌పై దమ్ముంటే బహిరంగ చర్చకు రండి. మిగతా..2లో

## 'రాష్ట్రంలో కోటిమంది మహిళల్ని కోటీశ్వరుల్ని చేయడమే మా లక్ష్యం'



- 'గత ప్రభుత్వం మహిళా సంఘాల్ని పట్టించుకోలేదు
- మహిళా సంఘాల్ని బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నాం
- మహిళలు ఆత్మగౌరవంతో బతకాలని ఏడాదికి రెండు చీరలు ఇస్తున్నాం

## ఢిల్లీ నూతన సీఎం కార్యాలయంలో ఇప్పటికీ కేజ్రీవాల్ ముద్ర!

ఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి మారారు. కొత్త ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ప్రమాణస్వీకారం చేశారు. బాధ్యతలూ చేపట్టారు. యమున నదికి హారతినిచ్చి, మంత్రివర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి... కొన్ని ముఖ్యమైన నిర్ణయాలూ తీసుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి, మాజీ మంత్రుల వ్యక్తిగత సిబ్బంది సేవలను తొలగించారు. గత ప్రభుత్వం ఇతర చోట్ల నియమించిన సిబ్బందిని గతంలో తాము పనిచేసిన చోట్ల రిపోర్టు చేయాలని ఆదేశాలు వెళ్లాయి. పరిపాలనలో తనదైన మార్కు చూపేందుకు రేఖా గుప్తా కార్యాచరణ మొదలుపెట్టినా, సీఎం కార్యాలయంలో ఇంకా కేజ్రీవాల్ ముద్రను ఆమె కొనసాగిస్తుండటం విశేషం. సచివాలయంలోని సీఎం కార్యాలయంలో గోడకు కేజ్రీవాల్ హయాంలో ఉంచిన బాబాసాహెబ్ అంబేద్కర్, భగత్ సింగ్ చిత్రపటాలు ఇంకా ఉన్నాయి. 2022 నుంచి ఢిల్లీ ప్రభుత్వ కార్యాలయాలు, పార్టీ ఆఫీసులలో అంబేద్కర్, భగత్ సింగ్ చిత్రపటాలు ఉంటున్నాయి. బీఆర్ అంబేద్కర్, భగత్ సింగ్ నుంచి తానెంతో ప్రేరణ పొందానని... ప్రభుత్వ కార్యాలయాలు, పార్టీ ఆఫీసులలో ఈ మహానేతల ఫొటోలే ఉంటాయని అప్పట్లో ఓ సందర్భంగా కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఇప్పటికీ కార్యాలయంలో కొత్త సీఎం రేఖా గుప్తా కుర్చీ వెనుక అంబేద్కర్, భగత్ సింగ్ ఫొటోలు కనిపిస్తున్నాయి.

## మోదీజీ.. అది వ్యక్తిగత అంశం కాదు

ఢిల్లీ: అమెరికాలో విలేకరుల సమావేశంలో అదానీ గురించి అడిగిన ప్రశ్నకు ప్రధాని మోదీ ఇచ్చిన సమాధానాన్ని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి తప్పుపట్టారు. "నరేంద్రమోదీజీ.. అది వ్యక్తిగత అంశం కాదు. అది దేశప్రయోజనాలకు సంబంధించిన విషయం" అని ఉత్తరప్రదేశ్లోని సొంత నియోజకవర్గం రాయబరేలీలో జరిగిన కార్యక్రమంలో రాహుల్ విమర్శించారు. ఇటీవల ప్రధాని మోదీ అగ్రరాజ్యంలో పర్యటించిన సంగతి తెలిసిందే. అదానీ గ్రూప్‌పై అమెరికాలో పెట్టిన కేసు గురించి ట్రంప్‌తో భేటీ సమయంలో చర్చకు వచ్చిందా..? అని మీడియా సమావేశంలో మోదీకి ప్రశ్న ఎదురైంది. "భారత్ ఓ ప్రజాస్వామ్య దేశం. వసుధైక కుటుంబం అనేది మా సంస్కృతి. ప్రపంచం మొత్తం మా కుటుంబం అనుకొంటాం. ప్రతి భారతీయుడిని మావాడిగానే భావిస్తాం. ఇద్దరు దేశాధినేతలు ఎప్పుడూ వ్యక్తిగత స్థాయి అంశాలను చర్చించరు" అని ప్రధాని వెల్లడించారు. ఈ సమాధానాన్ని రాహుల్ గతంలోనూ విమర్శించారు. "ఈ విషయం గురించి దేశంలో ఎవరైనా ప్రశ్నిస్తే మౌనం దాల్చే ప్రధానమంత్రి.. అదే ప్రశ్నను విదేశాల్లో ఎవరైనా అడిగితే అది వ్యక్తిగత విషయమని బదులిస్తారు" అని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 20 ఏళ్లలో 2 బిలియన్ డాలర్ల లాభాన్ని పొందేలా అధిక ధరకు సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసేలా ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 'ఉన్నత స్థాయి' వర్గాలకు లంచాలు ఇచ్చినట్లు ఎఫ్‌సీపీఏ కింద పలువురిపై అమెరికాలో కేసులు నమోదు చేశారు. ఆ నిధులను అమెరికాలో పెట్టుబడి కింద అదానీ గ్రూప్ సమీకరించడమే అక్కడ కేసు నమోదుకు కారణం. సౌర విద్యుత్ విక్రయ కాంట్రాక్టుల్లో అనుకూల షరతులు అమలుచేసేందుకు అదానీ గ్రూప్ 250 మిలియన్ డాలర్ల (రూ.2029 కోట్లు) మేర లంచాలు ఇచ్చారన్నది ఆరోపణ. ఇటీవల వ్యాపారాల్లో కొనసాగడానికి, ప్రాజెక్టులు దక్కించుకోవడానికి విదేశీ ప్రభుత్వాలు, అధికారులకు లంచం ఇచ్చే అమెరికా కంపెనీలు, విదేశీ సంస్థలపై చర్యలు తీసుకొనే 1977 ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్(ఎఫ్‌సీపీఏ) అమలును నిలిపేస్తూ ట్రంప్ సంతకాలు చేసి, యూఎస్ అటార్నీ జనరల్ పామ్ బోండికి ఆదేశాలు జారీ చేయడంతో అదానీ గ్రూప్‌నకు ఊరట లభించింది.

## 'భారత ఎన్నికల్లో అమెరికా జోక్యం"..

ఢిల్లీ: భారతదేశ ఎన్నికల్ని ప్రభావితం చేయాలనే ఉద్దేశ్యంతో, 21 మిలియన్ డాలర్లను గత అమెరికా ప్రభుత్వం కేటాయించిందని ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. ఈ ఆరోపణలపై ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్పై తీవ్ర విమర్శలు చేస్తోంది. "కాంగ్రెస్ ఎకో సిస్టమ్", రాహుల్ గాంధీలు ఈ నిధుల్ని వాడుకున్నారని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా ట్రంప్ ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.." ఈ ఆరోపణలు తీవ్ర ఆందోళనకరమైనవి"గా అభివర్ణించారు. సంబంధిత అధికారులు వీటిని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. "అమెరికా కార్యకలాపాలు మరియు నిధులకు సంబంధించి అమెరికా పరిపాలన విడుదల చేసిన సమాచారాన్ని మేము చూశాము. ఇవి స్పష్టంగా చాలా బాధ కలిగించేవి. ఇది భారతదేశ అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యం గురించి ఆందోళనలకు దారితీసింది" అని చెప్పారు. ప్రభుత్వం ఈ విషయాన్ని చురుకుగా పరిశీలిస్తోందని, ఈ దశలో వివరణాత్మక బహిరంగ ప్రకటన చేయడం లేదని వెల్లడించారు. ఈ వారం ప్రారంభంలో మియామీలో ఒక ప్రసంగంలో ట్రంప్ మాట్లాడుతూ.. భారతదేశానికి యూఎస్ ఎయిడ్ గ్రాంట్‌ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. జోబైడెన్ ప్రభుత్వం భారతదేశంలో వేరొకరని ఎన్నుకోవడానికి ప్రయత్నించిందని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో జోక్యం చేసుకోవడానికి ప్రయత్నించిందని పేర్కొన్నారు. "భారతదేశంలో ఓటర్ల సంఖ్య కోసం మన 21 మిలియన్ డాలర్లు ఎందుకు ఖర్చు చేయాలి..? వారు(బైడెన్ అడ్మినిస్ట్రేషన్) వేరొకరిని ఎన్నుకునేందుకు ప్రయత్నించారని అనుకుంటున్నాను" అని ట్రంప్ అన్నారు. ట్రంప్ వ్యాఖ్యలు బీజేపీ గత కొంత కాలంగా కాంగ్రెస్, జార్జ్ సోరోస్, అమెరికా డీప్ స్టేట్‌పై చేస్తున్న ఆరోపణలకు బలం చేకూర్చాయి. రాహుల్ గాంధీని, కాంగ్రెస్‌ని ఉద్దేశిస్తూ బీజేపీ దాడి చేస్తోంది. అయితే, ఇప్పటి వరకు దీనిపై వీరు స్పందించలేదు. మరోవైపు, 2008 నుంచి భారతదేశంలో ఎన్నికల ప్రాజెక్టుకు సంబంధించి USAID గ్రాంట్ కేటాయించబడలేదని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దర్యాప్తు నివేదిక పేర్కొంది. బంగ్లాదేశ్‌లో ఓటర్ భాగస్వామ్యం కోసం "అమర్ ఓటు అమర్"(నా ఓటు నాది) అనే ప్రాజెక్టు కోసం 2022లో యూఎస్ ఎయిడ్ నుంచి నిధులు వచ్చాయని తెలిపింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదికను ఉటంకిస్తూ, బీజేపీ తమకు క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. అంతకుముందు బీజేపీ కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ, రాహుల్ గాంధీని దేశద్రోహిగా, భారతదేశాన్ని బలహీనపరిచే కుట్ర పన్నినట్లు ఆరోపించింది.

## పవన్ కల్యాణ్ పై అనుచిత పోస్టు.. కేసు నమోదు

అమరావతి: ఇతరులను కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిపై కేసులు నమోదవుతున్నప్పటికీ... కొందరు మాత్రం తమ బుద్ధిని మార్చుకోవడం లేదు. తమకు నచ్చని వ్యక్తులపై అనుచిత పోస్టులు పెడుతూనే ఉన్నారు. తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై హర్షవర్ధన్ రెడ్డి అనే వ్యక్తి ఎక్స్ వేదికగా పెట్టిన పోస్ట్ కలకలం రేపుతోంది. కుంభమేళాలో తన భార్య అనా, కుమారుడు అకీరా నందన్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, టీటీడీ సభ్యుడు ఆనందసాయిలతో కలిసి పవన్ కల్యాణ్ పుణ్యస్నానాలు ఆచరించిన సంగతి తెలిసిందే. వీరు పుణ్యస్నానాలు చేస్తున్న ఫొటోను మరో సినీనటుడు సంపూర్ణేశ్ బాబుతో పోలుస్తూ హర్షవర్ధన్ రెడ్డి ఒక ఫొటోను పోస్ట్ చేశాడు. ఈ పోస్ట్ పై జనసైనికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. జనసేన నేత రిషికేశ్ కావలి టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. రిషికేశ్ ఫిర్యాదు మేరకు కావలి పోలీసులు కేసు నమోదు చేశారు.

## గ్రూప్-2 అభ్యర్థుల పరిస్థితిని పట్టించుకోరా?: షర్మిల

అమరావతి: గ్రూప్-2 మెయిన్స్ అభ్యర్థుల ఆందోళనలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందించారు. గ్రూప్-2 అభ్యర్థులతో చంద్రబాబు ప్రభుత్వం చర్చించాలని డిమాండ్ చేశారు. 2023 డిసెంబరు 11వ తేదీన ఇచ్చిన నోటిఫికేషన్ రోస్టర్ విధానంలో తప్పులు ఉన్నాయని గ్రూప్-2 మెయిన్స్ అభ్యర్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. తప్పులను సరిదిద్దకుంటే నష్టం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని వివరించారు. "న్యాయపరమైన ఇబ్బందులతో నోటిఫికేషన్ రద్దయ్యే పరిస్థితులు ఉంటాయని అంటున్నారు. రోస్టర్ విధానంలో తప్పుల తడకతో ఝార్ఖండ్ తరహాలో నోటిఫికేషన్ రద్దయి ఉద్యోగాలు పోయిన పరిస్థితులు ఇక్కడ కూడా ఎదురవుతాయని అభ్యర్థులు భయపడుతున్నారు. తప్పులు సరిదిద్దాలని అభ్యర్థులు కోరుతున్నారు. మరోవైపు అడ్వొకేట్ జనరల్ సైతం తప్పులు ఉన్నాయని కోర్టులో ఒప్పుకుంటే... హడావిడిగా ఈ నెల 23న పరీక్ష నిర్వహించాల్సిన అవసరం ఏమొచ్చిందని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాం. ఏపీపీఎస్సీ మొండిగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఏంటి? రాష్ట్రవ్యాప్తంగా రోడ్లపై గ్రూప్-2 మెయిన్స్ అభ్యర్థులు ఆందోళనలు చేస్తుంటే వారి విజ్ఞప్తిని పట్టించుకోరా?. రోస్టర్ విధానంలో తప్పులు సరిదిద్దే అంశంపై మెయిన్స్ పరీక్ష నిర్వహణపై కూటమి ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలి. ఆందోళనలో ఉన్న గ్రూప్-2 మెయిన్స్ అభ్యర్థులను పిలిచి చర్చించాలని కాంగ్రెస్ పార్టీ తరపున సీఎం చంద్రబాబును డిమాండ్ చేస్తున్నాం" అంటూ షర్మిల ట్వీట్ చేశారు. గ్రూప్-2 మెయిన్స్ అభ్యర్థులు ఆందోళన చేపడుతున్న వీడియోను కూడా పంచుకున్నారు.

## మోదీ, అమిత్ షాకు మిథున్ రెడ్డి లేఖ

అమరావతి: వైసీపీ అధినేత జగన్ గుంటూరు మిర్చి యార్డు పర్యటన సందర్భంగా అడుగడుగునా భద్రతా వైఫల్యం కనిపించిందని ఆ పార్టీ నేతలు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి లేఖ రాశారు. జగన్ కు కేంద్ర బలగాలతో రక్షణ కల్పించాలని లేఖలో ఆయన కోరారు. ముఖ్యమంత్రిగా పని చేసిన జగన్ కు భద్రత కల్పించడంలో ఏపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని లేఖలో మిథున్ రెడ్డి ఆరోపించారు. మిర్చి యార్డు పర్యటనకు వెళ్లిన జగన్ కు పోలీసులు సరైన భద్రత కల్పించలేదని విమర్శించారు. జడ్ ప్లస్ సెక్యూరిటీ కేటగిరిలో ఉన్న జగన్ కు కేంద్ర బలగాలతో భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల జగన్ నివాసం వద్ద కూడా కొన్ని ఘటనలు జరిగాయని మిథున్ రెడ్డి తెలిపారు. కుట్రలో భాగంగానే ఇవన్నీ జరుగుతున్నాయని... జగన్ ప్రాణాలకు ముప్పు తెచ్చే విధంగా భద్రతా వైఫల్యం కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రమాదకర ధోరణికి తెరలేపుతోందని అన్నారు. మిథున్ రెడ్డి లేఖపై కేంద్ర ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి. మరోవైపు, ఇప్పటికే రాష్ట్ర గవర్నర్ ను వైసీపీ నేతలు కలిశారు. గుంటూరు పర్యటనలో జగన్ కు తగిన రక్షణ కల్పించలేదని ఆయనకు ఫిర్యాదు చేశారు.

## కేసీఆర్ పై హైకోర్టులో పిటిషన్

మొదటి పేజి తరువాయి

ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ప్రజల పక్షాన అసెంబ్లీలో పోరాడాలని, అసెంబ్లీకి రాకపోతే ఎమ్మెల్యే సభ్యత్వంపై వేటు వేయాలని విజయ్ పాల్ రెడ్డి కోరారు. కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించాలని, కేసీఆర్ నియోజకవర్గంలో వేరే వాళ్లను పోటీ చేయించాలని అన్నారు. 2023 డిసెంబర్ 16న ప్రతిపక్ష నేతగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టారని, ఆయన ఇప్పటి వరకు అసెంబ్లీకి రాకున్నా స్పీకర్ కానీ, ఆయన కార్యాలయం కానీ ఎలాంటి ప్రొసీడింగ్స్ చేపట్టలేదని పిటిషన్ లో పేర్కొన్నారు. ప్రజల గొంతుకను అసెంబ్లీలో వినిపించేందుకు ఎమ్మెల్యేల జీతాలు కూడా పెంచారని, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ బాధ్యతలను నిర్వహించలేకపోతే ఆయనను ఆ బాధ్యతల నుంచి తొలగించాలని కోర్టును కోరారు. శాసన వ్యవస్థ, అధికారులు తీసుకునే రాజకీయ, ఆర్థిక నిర్ణయాలను సమీక్షించే అధికారం న్యాయ వ్యవస్థకు ఉందని చెప్పారు. ప్రతివాదులుగా కేసీఆర్, కేటీఆర్ లతో పాటు స్పీకర్, స్పీకర్ కార్యాలయాన్ని చేర్చారు. ప్రస్తుతం ఈ పిటిషన్ రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది.

# పదేళ్ల పాలనపై.. కేసీఆర్, కిషన్‌రెడ్డి చర్చకు సిద్ధమా?

మొదటి పేజి తరువాయి




వైఎస్ఆర్, జగన్ పోతిరెడ్డిపాడు ద్వారా కృష్ణా నీళ్లు రాయలసీమకు తరలించుకుపోతుంటే కేసీఆర్ నోరెత్తలేదు. నా మీద పగతో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టును పక్కన పడేశారు. ప్రజా పాలన సరిగా లేదని విమర్శలు చేస్తున్నారు. పదేళ్లు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారు, 12 ఏళ్ల నుంచి మోదీ ప్రధానిగా ఉన్నారు, 12 నెలలుగా కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అధికారంలో ఉంది. ప్రతిపక్ష నేతగా కేసీఆర్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి చర్చకు వస్తే ముఖ్యమంత్రిగా నేను సిద్ధం. గత పదేళ్ల పాలనపై చర్చిద్దాం.. చర్చలో ఓడితే ముక్కు నేలకు రాస్తా. పదేళ్లలో ఏమీ చేయని వాళ్లు ఏడాదిలోనే కాంగ్రెస్ ఏమీ చేయలేదని అంటున్నారు. పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు, పరిశ్రమలను అడ్డుకోవాలని కుట్రలు చేస్తున్నారు. మోసగాళ్ల మాటలు విని భూసేకరణను అడ్డుకోవద్దు. భూమి కోల్పోయిన వారికి మంచి పరిహారం ఇచ్చి న్యాయం చేసే బాధ్యత నాది" అని సీఎం అన్నారు.

ఏటా మహిళలకు అలాంటి రెండు చీరలు ఇస్తాం: రేవంత్ రెడ్డి

మహిళా సమాఖ్య సభ్యులకు ఇక నుంచి ప్రతి ఏటా రెండు చీరలు ఇస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో పిట్టలను బెదిరించేందుకు పంట పొలాల చుట్టూ కట్టే నాణ్యతలేని చీరలు ఇచ్చారని, కానీ ఇప్పుడు సొంత ఆడపడుచు పండుగపూట ఇంటికి వస్తే ఎలాంటి మంచి చీరను పెడతామో అలాంటి నాణ్యతతో కూడిన చీరలను ఇస్తామని ఆయన తెలిపారు. నారాయణపేట జిల్లాలోని అప్పక్‌పల్లెలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వం లక్ష్యమన్నారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలను పట్టించుకోలేదని విమర్శించారు. మహిళా సంఘాలు ఆర్థికంగా మరింతగా ఎదగాలని అన్నారు. మహిళా సంఘాలను బలోపేతం చేయాలని నిర్ణయించామని ఆయన అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సమాఖ్యలో 67 లక్షల మంది ఉన్నట్లు చెప్పారు. ఈ సభ్యులకు ఇక నుంచి రూ. 1,000 కోట్ల ఖర్చుతో ఏడాదికి రెండు చీరలు ఇస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని శిల్పారామం వద్ద మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకోవడానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. దీనిని మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొలుత ప్రతి జిల్లాలో ఒకచోట ప్రభుత్వ భూముల్లో మహిళా సమాఖ్యలకు పెట్రోల్ బంకులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆ తర్వాత అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక్కటైనా ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాలలో పాఠశాలల నిర్వహణ బాగుండేలా మహిళలు చొరవ తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో వసతులు సరిగ్గా లేకపోయినా, ఉపాధ్యాయులు లేకపోయినా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. నిధులను ప్రభుత్వం ఇస్తుందని, నిర్వహణ మాత్రం మహిళలదే బాధ్యత అన్నారు. నిధులు ఇచ్చినా నిర్వహణ లేకపోతే ప్రయోజనం లేదని ఆయన అన్నారు.

### 'రాష్ట్రంలో కోటిమంది మహిళల్ని కోటీశ్వరుల్ని చేయడమే మా లక్ష్యం'

'తెలంగాణలో కోటి మంది మహిళల్ని కోటీశ్వరుల్ని చేయడమే తన లక్ష్యం' అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 'గత ప్రభుత్వం మహిళా సంఘాల్ని పట్టించుకోలేదు. మహిళా సంఘాల్ని బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నాం. మహిళలు ఆత్మగౌరవంతో బతకాలని ఏడాదికి రెండు చీరలు ఇస్తున్నాం. గతంలో మామూలు చీరలు ఇచ్చేవారు. ఇప్పుడు ఖరీదైన చీరలు ఇస్తున్నాం. అంబానీ, అదానీలు పోటీపడే సోలార్ ప్రాజెక్టులలో మహిళలను ప్రోత్సహిస్తాం. మహిళలు వ్యాపారంలో వేగంగా ఎదిగేలా వారిని ప్రోత్సహిస్తున్నాం. దేశంలోనే తొలిసారి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేసుకోవడం సంతోషం. ఈ ప్రభుత్వంలో మహిళలకే మొదటి ప్రాధాన్యత ఉంటుంది. మహిళలు ఆత్మగౌరవంతో బ్రతుకుతారని మా ప్రభుత్వం ప్రగాఢంగా నమ్ముతోంది. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత మహిళా స్వయం సహాయక సంఘాలను పునరుద్ధరించాం. రాష్ట్రంలో మహిళా శక్తి 67 లక్షల మంది తెలంగాణలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం. అన్ని రంగాల్లో మహిళలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.. 600 ఆర్టీసీ బస్సులకూ యజమానులను చేశాం. వెయ్యి మెగావాట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసేలా మహిళలకు అవకాశాలు కల్పిస్తున్నాం. మహిళా స్వయం సహాయక ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడానికి శిల్పారామం వద్ద స్టాల్స్ ఏర్పాటు చేసి ఇచ్చాం. త్వరలోనే మహిళా స్వయం సహాయక సంఘాలకు ఏడాదికి రెండు చీరలు కానుకగా ఇవ్వనున్నాం. సొంత ఆడబిడ్డలకు అందించినట్లు నాణ్యమైన చీరలను అందించనున్నాం .రూరల్, అర్బన్ అనే తేడా లేదు. తెలంగాణలో మహిళలంతా ఒక్కటే.. అవసరమైతే కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుందాం. ఎంపీ డీకే అరుణ కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చేందుకు సహకరించాలని కోరుతున్నా. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మహిళల అభివృద్ధికి ఎలాంటి సహకారం కావాలన్నా అందించడానికి సిద్ధంగా ఉన్నాం. పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టండి. నిధులు మేం ఇస్తాం..నిర్వహణ మీరు చేయండి. గుడిని ఎంత పవిత్రంగా నిర్వహించుకుంటామో బడులను కూడా అలాగే నిర్వహించుకోవాలి' అని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# కేసీఆర్ అలా చేయకపోయి ఉంటే చంద్రబాబుతో పంచాయితీ ఉండకపోయేది

మొదటి పేజి తరువాయి



లక్ష కోట్ల రూపాయలు పెట్టి ప్రాజెక్టు కడితే అది కూలిపోయిందని మండిపడ్డారు. లగచర్లలో గొడవ పెట్టాలని చూశారని, కలెక్టర్‌ను చంపాలని చూశారని సంచలన ఆరోపణలు చేశారు. మా పాలమూరు ప్రాంతానికి పరిశ్రమలు రావొద్దా? ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. గట్టిగా కొడతానని కేసీఆర్ ఇటీవల అంటున్నారని, కొట్టడానికి అదేమైనా ఫుల్లా? హాఫా? అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ కొట్టాల్సింది తనను కాదని, తప్పు చేస్తున్న ఆయన కొడుకు, అల్లుడిని కొట్టాలని వ్యాఖ్యానించారు. గట్టిగా కొడితే తమ పార్టీ కార్యకర్తలు ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. కేసీఆర్ పదేళ్ల కాలంలో పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలని నిలదీశారు. కేసీఆర్‌కు ఎంపీ పదవి పాలమూరు ప్రజల బిక్షే అన్నారు.

ప్రాజెక్టుల రీ డిజైన్ పేరుతో దోపిడీకి పాల్పడ్డారు

ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో దోపిడీకి పాల్పడ్డారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన చోటే ఓట్లు అడగాలని బీఆర్ఎస్ నేతలు అంటున్నారని, అందుకు తాము సిద్ధమని ఆయన చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు ఉన్న చోట కాంగ్రెస్ ఓట్లు అడుగుతుందని, డబుల్ బెడ్రూంలు ఉన్న చోట బీఆర్ఎస్ అడగడానికి సిద్ధమా? అని సవాల్ చేశారు. పాలమూరు పేదరికాన్ని చూపించి కేసీఆర్ మార్కెటింగ్ చేసుకున్నారని ఆరోపించారు. తనపై కోపంతో కేసీఆర్ పాలమూరుపై కక్ష కట్టారని విమర్శించారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ప్రాజెక్టులపై తాను దృష్టి సారించానని అన్నారు. ఆంధ్రప్రదేశ్ కృష్ణా నీటిని తరలించుకుపోతుంటే కేసీఆర్ మౌనంగా ఉన్నారని విమర్శించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవలేదని, 2024 లోక్ సభ ఎన్నికల్లో ఎంపీ సీట్లు ఒక్కటి కూడా రాలేదని గుర్తు చేశారు. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆ పార్టీకి అభ్యర్థులు కూడా దొరకడం లేదు, అదో పార్టీయా అని ఎద్దేవా చేశారు.

### మీ బిడ్డ ముఖ్యమంత్రిగా ఉంటే పంచాయితీ పెట్టాలని చూస్తున్నారు

మీ బిడ్డ ముఖ్యమంత్రిగా ఉంటే కొంతమంది పంచాయితీ పెట్టాలని చూస్తున్నారని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. పాలమూరుకు ముఖ్యమంత్రి రూపంలో ఒక అవకాశం వచ్చిందని ఆయన అన్నారు. మన ఇంటి బిడ్డకు అవకాశమొస్తే కడుపులో కత్తులు పెట్టి చంపాలని చూస్తున్నారని విమర్శించారు. అలాంటి వారికి పాలమూరు యువత బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పనులు చేసే బాధ్యత తనదని, తనను కాపాడుకునే బాధ్యత మాత్రం పాలమూరు ప్రజలదే అన్నారు. మనకు మళ్లీ ఇలాంటి అవకాశం రాదని ఆయన అన్నారు. మనకు అవకాశం వచ్చినప్పుడే ప్రాజెక్టులు పూర్తి చేసుకుందామని అన్నారు. కొడంగల్‌లో ప్రాజెక్టులు తెచ్చి నిరుద్యోగ సమస్యలను పరిష్కరించుకుందామని ఆయన అన్నారు.

భూసేకరణను అడ్డుకోవద్దని విజ్ఞప్తి

పాలమూరు ప్రజలు భూసేకరణను అడ్డుకోవద్దని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. భూములు కోల్పోయిన వారికి మంచి పరిహారం ఇస్తామని అన్నారు. ఇక్కడ మీ బిడ్డ, మీ సోదరుడు ఉన్నాడని, కాబట్టి పరిహారం తప్పకుండా ఇస్తామన్నారు. నష్టపరిహారం ఇచ్చి, ఉద్దండపూర్ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యతను తీసుకుంటానని హామీ ఇచ్చారు. పాలమూరు ప్రజల కష్టాలను తీర్చకుంటే మీ బిడ్డ అధికారంలో ఉండి ఏం లాభమని వ్యాఖ్యానించారు.

## అతడి కథ ఒక స్ఫూర్తిదాయక జీవిత పాఠం

అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియాలో ఆసక్తికర పోస్టును పంచుకున్నారు. ఓ వ్యక్తి శ్రీకాకుళం జిల్లా నుంచి ఎన్నో ఏళ్ల కిందట హైదరాబాద్ కు వలసవెళ్లి అక్కడే వెదురు బుట్టలు, విసనకర్రలు, కొబ్బరి ఆకులతో పలు ఉత్పత్తులు తయారు చేస్తూ జీవిస్తున్న వైనాన్ని హ్యూమన్స్ ఆఫ్ హైదరాబాద్ అనే సోషల్ మీడియా హ్యాండిల్ పోస్టు చేసింది. ఈ పోస్టును షేర్ చేసిన ఏపీ సీఎం చంద్రబాబు... ఇది ఒక స్ఫూర్తిదాయక జీవితపాఠం అని కొనియాడారు. అతడి కథను పరిశీలిస్తే కష్టించి పనిచేసే స్వభావం, ఏపీ వాణిజ్య స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని తెలిపారు. కానీ, అతడు సొంతగడ్డను వదిలి అవకాశాలను వెతుక్కుంటూ వేరే ప్రాంతానికి వెళ్లడం తనను విచారానికి గురిచేసిందని చంద్రబాబు పేర్కొన్నారు. ఏదేమైనా ఆ వ్యక్తి పనితనం, ఆశావహ దృక్పథం బాగా నచ్చాయని... తన కలలను, కళను కలగలిపి వస్తువులుగా మలిచి జీవనం సాగిస్తుండడాన్ని ప్రగాఢంగా అభిమానిస్తున్నానని వివరించారు. "ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని పునర్ నిర్మించడానికి, అవకాశాలను సృష్టించడానికి కృషి చేస్తోంది. ఆ వ్యక్తిలా నైపుణ్యం ఉన్న వారు స్వస్థలంలోనే ఉంటే ఎదిగేందుకు తోడ్పాటు అందిస్తాం" అని చంద్రబాబు ట్వీట్ చేశారు.

## 'మద్దతు ధర ఆలోచన అప్పుడే ఎందుకు చేయలేదు?'

విశాఖ : మిర్చి రైతులకు మద్దతు ధర ఇవ్వాలనే ఆలోచన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు నెలల క్రితమే ఎందుకు చేయలేదని వైఎస్సార్ సీపీ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మిర్చి రైతులను పరామర్శించే వరకూ మీరు స్పందించ లేదంటే ఏమనుకోవాలని బొత్స నిలదీశారు.'కేంద్ర మంత్రి ఢిల్లీ లో లేనప్పుడు మిర్చి రైతుల కోసం చర్చించడానికి వెళుతున్నామని చెప్పడం ఎంత వరకు సమంజసం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మిర్చి యార్డ్ కు వెళ్ళిన తర్వాత మిర్చి రైతుల ఆవేదన ఈ ప్రభుత్వానికి తెలిసింది. మద్దతు ధర ఇవ్వాలనే ఆలోచన రెండు నెలల క్రితమే ఎందుకు చేయలేదు..రైతులు, వ్యవసాయం దండగ అనే భావన చంద్రబాబు మనసులో ఇంకా పోలేదు. మిర్చి రైతులను కలవడానికి జగన్మోహన్ రెడ్డి వెళ్లడం ఇల్లీగల్ యాక్టివిటీ అయితే అట్టహాసంగా విజయవాడలో జరిగిన మ్యూజికల్ నైట్ లీగల్ అవుతుందా...? .విశాఖలో జరిగిన భూ కుంభకోణాల పై విచారణ నివేదికల ను బహిర్గతం చెయ్యాలి. బురదజల్లడం కాదు ఆరోపణలు నిరూపించాలి...ఆ బాధ్యత ప్రభుత్వానిదే. జెడ్ కేటగిరీలో వున్నమాజీ ముఖ్యమంత్రి భద్రత ఎందుకు కుదిరించారు అని గవర్నర్ ఆశ్చర్య పోయారు. జగన్ భద్రత తనకు సంబంధం లేదని చెబుతున్న ముఖ్యమంత్రి.....మిర్చి యార్డ్ సందర్శనకు వెల్లడం ఇల్లీగల్ అని ఎలా చెబుతారు' అని బొత్స సూటిగా ప్రశ్నించారు.

## ఎల్ఆర్ఎస్ పేరుతో 50కోట్ల దోపిడీకి కాంగ్రెస్ ప్లాన్

మొదటి పేజి తరువాయి

ఇదే సమయంలో కేంద్ర బడ్జెట్‌పై దమ్ముంటే బహిరంగ చర్చకు రండి. మీకు చేతనైతే బీసీ రిజర్వేషన్లపై టెన్ జనపథ్ ఎదుట ధర్నా చేయండి. కాంగ్రెస్ నమ్మక ద్రోహానికి, బీజేపీ పోరాటాలకు మధ్య జరుగుతున్న ఎన్నికలు ఇవి. ఈ ఎన్నికల్లో కచ్చితంగా బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఇదిలా ఉండగా.. ఈ నెల 27న మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్- కరీంనగర్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలతోపాటు వరంగల్- ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి.

## ఇన్నేళ్లు ఏం చేశారో చూసుకోవాల

మొదటి పేజి తరువాయి

ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మొదటి రోజే తాము కేబినెట్ సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఆయుష్మాన్ భారత్ యోజనను అందుబాటులోకి తీసుకువచ్చామని వెల్లడించారు. దీంతో ప్రజలకు రూ.10 లక్షల మేరకు వైద్య సహాయం అందుతుందని తెలిపారు. ప్రజలకు రూ.10 లక్షల విలువ చేసే వైద్య సహాయాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ అమలు చేయలేదని విమర్శించారు. పదమూడేళ్లు ఏమీ చేయని వారికి తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు లేదన్నారు. నరేంద్ర మోదీ నేతృత్వంలో ఢిల్లీ తన హక్కులన్నింటినీ పొందుతుందని అన్నారు. ముందు మీరు మీ పార్టీ గురించి చూసుకోవాలని హితవు పలికారు. ఆమ్ ఆద్మీ పార్టీని ఎంతోమంది వీడాలనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. కాగ్ నివేదికను అసెంబ్లీలో పెడితే అన్ని విషయాలు తెలుస్తాయని ముఖ్యమంత్రి అన్నారు. ఢిల్లీలో మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందించే పథకాన్ని మొదటి కేబినెట్ సమావేశంలో ఆమోదిస్తామని బీజేపీ హామీ ఇచ్చిందని, కానీ మొదటి రోజు దానిని ఉల్లంఘించిందని మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు అతిషి ఆరోపించారు. అతిషి విమర్శలకు ముఖ్యమంత్రి పైవిధంగా కౌంటర్ ఇచ్చారు.

## ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రవేశపెట్టే తొలి పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే..?

మొదటి పేజి తరువాయి

బడ్జెట్ రూపకల్పనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టిపెట్టారు. ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అధికారులతో రెండు మూడుసార్లు సమావేశమయ్యారు.

మంత్రులతో సమావేశాలు..

చంద్రబాబుతో సమావేశం తర్వాత.. ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్.. అన్ని శాఖల మంత్రులు, కార్యదర్శులతో సమావేశాలు నిర్వహించారు. ఆయా శాఖల ప్రతిపాదనలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఆయా శాఖల కార్యదర్శులు ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు సమర్పించారు. ముఖ్యంగా జలవనరుల శాఖ, సాంఘీక సంక్షేమ శాఖ, విద్య, వైద్య శాఖలకు భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఎక్కువ నిధులు రాబట్టేలా..

ఇటు కేంద్ర ప్రాయోజిత పథకాలను ఎక్కువగా వినియోగించుకునేందుకు అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. అటు కేంద్రం నుంచి వీలైనంత ఎక్కువ నిధులు రాబట్టేలా ప్లాన్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ.. నిధులు సమీకరించుకోవాలి ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా విద్య, వైద్య శాఖ ద్వారా కేంద్రం నుంచి ఎక్కువ నిధులు పొందవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

మూడు కొత్త పథకాలకు..

సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను.. కొత్త ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించేందుకు ప్లాన్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నూతన ఇసుక విధానాన్ని అమలు చేసింది. దీంతో ఆదాయం తగ్గింది. పోలవరం, అమరావతి వంటి కీలక ప్రాజెక్టులకు కేంద్రం సాయం చేస్తోంది. ఇది కొంతమేర ఊరటనిస్తోంది. అయితే.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ప్రత్యేక సాయం చేయాలని సీఎం చంద్రబాబు కేంద్రాన్ని కోరుతున్నారు.

రూ.3 లక్షల కోట్లతో..

గత ప్రభుత్వం భవిష్యత్తు ఆదాయాలను కూడా తాకట్టు పెట్టిందని.. ఆర్థిక వ్యవస్థ గాడి తప్పిందని కూటమి నేతలు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2.94 లక్షల కోట్లతో నవంబర్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇప్పుడు రూ.3 లక్షల కోట్లు దాటే అవకాశం ఉందని తెలుస్తోంది.

## కూటమి అభ్యర్థి ఆలపాటి గెలుపే లక్ష్యం : ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి



రెంటచింతల, మండల రిపోర్టర్ -శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ (తెలుగుదేశం) గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని మాచర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి రెంటచింతల విచ్చేసిన ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి స్థానిక టీడీపీ నేతలతో కలిసి వై ఆర్ ఎస్ ఉన్నత పాఠశాల, రామకృష్ణ గురుకులం, వివేకా స్కూల్, సెయింట్



జోసెఫ్స్ ఉన్నత పాఠశాల, అల్ఫోన్స్ పాఠశాలలకు వెళ్లి అక్కడ ఉపాధ్యాయులు, పట్టభద్రులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటిని బలపరచాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో నిరుద్యోగ పట్టభద్రులకు వైకాపా ప్రభుత్వం ఏమీ చేసింది లేదన్నారు. గత ప్రభుత్వం ఏటా జాబ్ కార్డు విడుదల చేస్తామని,మెగా డీఎస్సీ చేపడతామని యువతను మోసం చేసిందన్నారు. అందుకనే ప్రస్తుత ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ఎవరినీ బరిలో దింపలేదన్నారు. రాబోయే



రోజుల్లో దశల వారీగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. ఈనెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ను అత్యధిక ఓట్లతో గెలిపించాలన్నారు. అనంతరం పార్టీ మండల టీడీపీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. మండలంలో 832 పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని, వాటిల్లో సింహభాగం కూటమి అభ్యర్థి ఆలపాటికి పడేలా నేతలు బాధ్యత తీసుకుని సహచర భాజపా,జనసేన పార్టీ నేతల సమన్వయంతో పార్టీ గెలుపుకు కృషి చేయాలన్నారు. సాధారణ ఎన్నికలను ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా సీరియస్ గా తీసుకోవాలని నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఇంటింటికి వెళ్లి పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించాలన్నారు. ఏడేళ్ల అనంతరం ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ, విద్యావ్యవస్థలో తీసుకొస్తున్న మార్పులు, రిక్రూట్మెంట్ తదితర అంశాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి సూచించారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మంచి పాలన సాగిస్తుండడంతో టీడీపీ అభ్యర్థులపై ఓటర్లలో సానుకూలత వ్యక్తమవుతోందని దీంతో టీడీపీ గెలుపు ఖాయమని పేర్కొన్నారు. ప్రచారంలో ఎమ్మెల్యే వెంట పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

## రెవిన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన-మంత్రి స్వామి



టంగుటూరు మండల రిపోర్టర్ :- వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) :- కొండపి నియోజకవర్గ స్థాయి మండల రెవెన్యూ అధికారులతో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి శుక్రవారం తూర్పు నాయుడుపాలెంలోని ఆయన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి హ యంలో నియోజకవర్గంలో జరిగిన ఫ్రీ హోల్డ్ ల్యాండ్స్ అక్రమాలు గుర్తించాలని ప్రభుత్వం పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాల కోసం అనువైన ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. అదేవిధంగా పరిశ్రమలకు భూములను కేటాయించే అంశంలో రైతులు కలెక్టర్ లతో సంప్రదించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కేటాయింపులు జరపరన్నారు. అవసరమైన పొజిషన్ సర్టిఫికెట్లు కుల ధ్రువీకరణ పత్రాలు ఆలస్యం చేయకుండా సకాలంలో అందించాలని విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండల రెవెన్యూ అధికారులు పాల్గొనడం జరిగింది.

## క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన వైసీపీ నాయకులు
## ముఖ్య అతిధిగా పాల్గొన్న కనిగిరి జెడ్పిటిసి మడతల కస్తూరి రెడ్డి



కనిగిరి రిపోర్టర్ జి. ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్):మహాశివరాత్రి సందర్భంగా వైసీపీ ఆధ్వర్యంలో కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో గల గార్లపేట రోడ్డు లోని ఓల్డ్ ఏజ్ హోం వెనుక భాగంలో నిర్వహించిన కనిగిరి నియోజకవర్గం స్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, కనిగిరి మండల పార్టీ అధ్యక్షులు జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి లు ప్రారంభించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నారు.. కనిగిరి మండల పార్టీ అధ్యక్షుడు జడ్పీటీసీ మడతల కస్తూరి రెడ్డి మాట్లాడుతూ ఆటలో గెలుపు ఓటములు సహజమని ఓటమి నుంచి గెలుపు దిశగా జట్లు సాధన చేయాలని అన్నారు.. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వాహకులు 40 టీములు ఈ టోర్నమెంట్లో పాల్గొంటున్నట్లు తెలిపారు.మొదటి బహుమతి కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ గారు రూ.23,456/- రెండవ బహుమతి యువజన విభాగం అధ్యక్షులు వాకమళ్ల రాజశేఖర్ రెడ్డి రూ.12,345/-మూడవ బహుమతి ఆర్ టి ఐ విభాగం అధ్యక్షులు తూము కృష్ణా రెడ్డి రూ. 5678/-...ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, జడ్పీటీసీ, కనిగిరి మండల అధ్యక్షులు మడతల కస్తూరి రెడ్డి,రాష్ట్ర రైతు విభాగం సెక్రటరీ సూరసాని మోహన్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి,జిల్లా వాలంటీర్ విభాగం అధ్యక్షులు రసూల్,పిసిపల్లి మండల అధ్యక్షులు గోపవరపు బొర్రారెడ్డి,నియోజకవర్గ వివిధ అనుబంధ విభాగల అధ్యక్షులు సిరుపగోవర్ధన్ రెడ్డి,డాక్టర్ ఆవుల కృష్ణా రెడ్డి, దాది రెడ్డి మాలకొండారెడ్డి, సంగటి



మహేంద్ర రెడ్డి,నాగమణి, గూడూరి లింకన్,గొల్లపల్లి సర్పంచ్ నారాయణ రెడ్డి, గురవాజీపేట సర్పంచ్ కుమ్మరికుంట రవి,మడతల వెంకటేశ్వర రెడ్డి,ముత్యాల ప్రతాప్,ఇండ్ల శ్రీకాంత్,నాని, లైలా కిషోర్, భాస్కర్,ఈర్ల శ్రీను,తమ్మినేని ఉమాశంకర్ రెడ్డి,కంటూ కేశవ,కిట్టు,లక్ష్మీనారాయణ,నరేష్, కంటూ శ్రీను,తోక బ్రహ్మయ్య యాదవ్, నాగూరుబి తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ విద్యార్థులు మంచి మార్కులు సాధించాలి
### జన విజ్ఞాన వేదిక జాతియ ఉపాధ్యక్షులు గయాజ్



కనిగిరి రిపోర్టర్ జి. ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్):విద్యార్థిని విద్యార్థులు 10వ తరగతి ని ముగించుకుంచుకొని భవిష్యత్ తరానికి మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని కనిగిరి నియోజకవర్గంలో అత్యుత్తమ మార్కులతో రాణించాలని జనవిజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షులు గయాజ్ కోరారు. శుక్రవారం కనిగిరిలోని మోడల్ స్కూల్ నందు ప్రిన్సిపాల్ శ్రీమతి డాక్టర్ పద్మావతి తులసి గారి ఆధ్వర్యంలో జరిగిన పదో తరగతి విద్యార్థుల మోటివేషన్ తరగతిలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రానున్న పదవ తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని పాఠశాలలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అందించే పదవ తరగతి గైడెన్స్ ను పొంది మంచి ఫలితాలను సాధించేందుకు కృషి చేయాలని అన్నారు..



విద్యార్థిని విద్యార్థులు తెల్లవారుజామున నాలుగు గంటలకే నిద్రలేచి పరీక్షలకు సన్నద్ధం కావాలని కోరారు.ఈ క్రమంలో మధ్యలో పాడిన గేయాలు విద్యార్థులను ఆలోచింపజేసాయి. బోజన సమయన్నికూడా మరచిపోయి ఎంతో ఆసక్తిగా విద్యార్థులు విన్నారు, గీతాలాపనకు, మోటివేషన్ కాలాన్ని కూడా మర్చిపోయారు,ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీమతి డాక్టర్ పద్మావతి తులసి, ఎస్ఎంసి చైర్మన్ పందిటి మోహన్ మాట్లాడుతూ గయాజ్ సేవలు ఎంతో అవసరమని,రాబోవు రోజులలో విధ్యావికాశానికి తోడ్పాడే కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు మంచి మార్కులతో పాస్ అవ్వాలని ఆకాంక్షిస్తూ స్కూల్లో ఫస్ట్ మార్క్ సాధించిన వారికి ఎస్ఎంసి చైర్మన్ పందిటి మోహన్ మోహన్ 5000 రూపాయలు బహు కరిస్తామని తెలిపారు, అనంతరం కెమిస్ట్రీ లెక్చరర్ సతీష్ పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు పెన్నులు, ఫ్యాడ్స్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమణయ్య, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు నారాయణ, జ్యోతి, గీత, కిషోర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలనుసమర్థంగా నిర్వహించాలి



నూజివీడు, ఫిబ్రవరి 21 శుభోదయం న్యూస్: ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించిన ఎన్నికల పరిశీలకులు సిహెచ్. శ్రీధర్ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలని ఎన్నికల పరిశీలకులు సిహెచ్. శ్రీధర్ అన్నారు. శుక్రవారం ఏలూరు విచ్చేసిన ఎన్నికల పరిశీలకులు సిహెచ్. శ్రీధర్ స్థానిక కలెక్టరేట్ లో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లాకలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి లతో చర్చించారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఏర్పాట్ల వివరాలను తెలుసుకున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 456 పోలింగ్ కేంద్రాల్లో 3,14,984 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. వీరిలో 1,83,347 మంది పురుషులు, 1,31,618 మంది మహిళలు, 19 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారన్నారు. ఏలూరు జిల్లాలో 66 పోలింగ్ కేంద్రాల్లో 42,282 మంది తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వీరిలో 24,704 మంది పురుషులు, 17,571 మంది మహిళలు, 7 గురు ట్రాన్స్ జెండర్లు ఉన్నారన్నారు. ఈనెల 12వ తేదీన పివోలు, ఎపివోలు, మైక్రోఅబ్జర్వర్లకు శిక్షణ నిర్వహించామన్నారు. రెండవ విడత ఈనెల 22వ తేదీ ఉదయం 10 గం. లకు గోదావరి సమావేశ మందిరంలో పివోలు, ఎపివోలు, జోనల్, రూట్ అధికారులకు ట్రైనింగ్ పూర్తవుతుందని తెలిపారు. ఓటర్ల స్లిప్పుల పంపిణీ ప్రక్రియకూడా చేపట్టడం జరిగిందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఏర్పాట్లను వివరించారు. ఎంసిసి, ఎఫ్ఎస్ టి, ఫ్లైయింగ్ స్క్వాడ్ లు కూడా ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలకు సంబందించి 456 పోలింగ్ కేంద్రాలకు 1199 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశామని వాటిలో ఏలూరు జిల్లాకు సంబంధించి 66 పోలింగ్ కేంద్రాలకు 217 పెద్ద బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశామన్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి సంబంధిత అధికారులంతా వారికి నిర్దేశించిన విధుల్లో నిమగ్నమైయున్నారన్నారు. ఈనెల 27వ తేదీన పోలింగ్ నిర్వహణకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, రిసెప్షన్ సెంటర్లు ఏర్పాట్లు కూడా చేపట్టామన్నారు. ఎన్నికల నిర్వహణకు 456 పోలింగ్ కేంద్రాలకు 2,714 మంది సిబ్బందిని నియమించామన్నారు. ఏలూరు జిల్లా పరిధిలో 66 పోలింగ్ కేంద్రాలకు 400 మంది ఎన్నికల సిబ్బందిని నియమించామన్నారు. జిల్లాలో 66 పోలింగ్ కేంద్రాలకు 66 మంది జోనల్ అధికారులను, 10 మంది రూట్ అధికారులను, 10 మంది సెక్టార్ అధికారులను నియమించామన్నారు.

## వెంకటగిరి నియోజకవర్గ సోషల్ మీడియా వింగ్ అధ్యక్షులుగా పర్చూరు రమేష్ గౌడ్ నియమకం



వెంకటగిరి, నియోజకవర్గం ఇంచార్జ్ - విసీ సుబ్బరాయుడు (శుభోదయం న్యూస్): వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గత 15 సంవత్సరాలుగా చురుకగా పనిచేస్తున్నటువంటి పర్చూరు రమేష్ గౌడ్ కి ఈరోజు కేంద్ర కార్యాలయం నుండి వెంకటగిరి నియోజకవర్గం సోషల్ మీడియా వింగ్ అధ్యక్షులుగా నియమిత పత్రం విలువడింది నేదురుమల్లి కుటుంబాన్ని నమ్ముకున్నటువంటి వ్యక్తులకు నేదురమల్లి కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుంది అన్నదానికి ఇదొక నిదర్శనం మండల కో కన్వీనర్ స్థాయి నుండి నియోజకవర్గం కన్వీనర్ గారి తీసుకువెళ్లను ఘనత నేదురుమల్లి కుటుంబం రమేష్ గౌడ్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నియోజకవర్గం సోషల్ మీడియా అధ్యక్షుడిగా నియమించినందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రివర్యులు జగన్మోహన్ రెడ్డి గారికి మరియు వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి జనార్దన్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలియజేశారు 2029లో జరగనున్న సారపత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి గారిని వెంకటగిరి నియోజకవర్గంలో రాంకుమార్ రెడ్డి గారి గెలుపు కొరకు అకరణశుల పని చేస్తానని తెలియజేశారు.

## చెంచు గిరిజనులకు ఐ.టి.డి.ఎ. శ్రీశైలం ప్రాజెక్టు అధికారి వారు ఉచిత ఆధార్ క్యాంప్ నిర్వహణ



దోర్నాల మండల రిపోర్టర్- ఆవులయ్య ( శుభోదయం న్యూస్ ): ప్రకాశం జిల్లా, దోర్నాల మండలంలో శుక్రవారం ఐ టి డి ఏ శ్రీశైలం ప్రాజెక్టు అధికారి శ్రీ వెంకట శివప్రసాద్ వారి గౌరవ ఆదేశాల మేరకు, ఆధార్ సహిత చెంచు గిరిజన గ్రామాల నిర్మాణంలో భాగంగా శ్రీ మధు సూధనరావు, ఎ.పి.ఐ.వో. ప్రకాశం జిల్లా, మరియు శ్రీ కరుణాకర్, కోఆర్డినేటర్, ఆదర్శ సంస్థ (ఎ.ఆర్.హెచ్.డి.యస్) వారి ఫీల్డ్ స్టాఫ్ తో చిలకచెర్ల గూడెం, బంధం బావి, మోట్ల/ మల్లికార్జునపురం మూడు చెంచు గిరిజన జనావాసాలనుండి ఆదార్ లేని వారిని గుర్తించి, వారికి బర్త్ సర్టిఫికెట్స్ మరియు డోమిసైల్ సర్టిఫికేట్ లను సచివాలయం, యం.పి.డివో, యం.ఆర్వో వారి సహకారంతో చేపించి ఆధార్ క్యాంప్ నిర్వహించటం జరిగింది. ఈ ఆధార క్యాంప్ లో 26 వివిధరకాల ఆధార అప్డేట్ లు మరియు 5 క్రొత్త ఆధార్ సర్వీసు లు ఉచితంగా అందజేయడం జరిగింది. ఈ కార్డులు ఆన్లైన్ లో అందుబాటులోకి వచ్చిన తరువాత వాటిని ప్రింటింగ్ చేసి ఆ చెంచు గిరిజనులకు లామినేషణ్ చేసి ఉచితంగా అందజేస్తామని వివరించారు. ఈ ఆధార్ క్యాంపులో ఆదర్శ సంస్థ (ఎ.ఆర్.హెచ్.డి.యస్) వారి ఫీల్డ్ స్టాఫ్ స్యామ్యుల్, కోటేశ్వరరావు, దావీదు, వెంకటేశం పాల్గొన్నారు. సిటి ఆధార ఆపరేటర్ సుబ్బయ్య పాల్గొన్నారు.ఇక్కడకు హాజరైన చెంచు గిరిజనులకు త్వరలో ఉపాధి హామీ కార్డులను ఐ.టి.డి.ఎ. ఉపాధి హామీ సిబ్బంది ద్వారా అర్హులైన వారందరికీ అందజేస్తామని, ప్రతి ఒక్కరు ఉపాధి హామీ దినాలను వినియోగించు కొని జీవన విధానాలను మేరుగుపరచుకోవాలని వివరించారు. మరల జనావాసంలో ఆధార్ సేవల అవసరాన్ని బట్టి చెంచు గిరిజనులకు ఆధార్ క్యాంప్ లు నిర్వహిస్తామని వివరించారు.

## జాతీయ క్షయ వ్యాధి నివారణ వారోత్సవ కార్యక్రమం కార్యక్రమం



దోర్నాల మండల రిపోర్టర్- ఆవులయ్య (శుభోదయం న్యూస్ ): ప్రకాశం జిల్లా దోర్నాల మండలంలోజాతీయ క్షయ వ్యాధి నివారణ వారోత్సవ కార్యక్రమం లో భాగంగా %ఙూ౹ఔ=ా దీశీం% స్కూల్ నందు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా టీబీ ట్రీట్మెంట్ సూపర్వైజర్ %చీ%. వెంకటరమణ మాట్లాడుతూ క్షయ వ్యాధి మైక్రో బ్యాక్టీరియం ట్యూబారులై అనే బ్యక్టీరియా ద్వారా వ్యాపిస్తుంది అని, రెండు వారాలకి మించి దగ్గు, సాయంత్రం పూట జ్వరం రావడం, బరువు తగ్గిపోవటం, ఆకలి మందగించటం, దగ్గినప్పుడు కళ్లెలో రక్తం చారికలు పడటం తదితర లక్షణాలు ఉన్న వెంటనే ఆశ లేదా ఏఎన్ఎం ద్వారా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి కళ్లే పరీష



చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం %ఖ%. నాగలక్ష్మి, %మీూవూ% సౌజన్య, ఆశ కార్యకర్త లు నాగమ్మ, రాణెమ్మ, ప్రావిణ్యా, %%.రాణి పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 37వ వార్షికోత్సవవేడుకలు





(శుభోదయం న్యూస్) బిట్రగుంట: బిట్రగుంటప్రభుత్వజూనియర్ కళాశాలలోశుక్రవారం37 వవార్షికోత్సవవేడుకల కళాశాలప్రిన్సిపాల్ జి. శ్రీనివాసరావుఆధ్వర్యంలోఘనంగా నిర్వహించడంజరిగింది.కార్యక్రమానికిముఖ్యఅతిథులుగామండలవిద్యాశాఖఅధికారులు నరసింహారావు,జయమ్మవిచ్చేసివిద్యార్థులనుఉద్దేశించిప్రసంగించారు. అనంతరంక్రీడలు,విద్యాభ్యాసంలోప్రతిభకనపరిచిన ద్యార్థులకుబహుమతిప్రధానంచేశారు. పైకార్యక్రమంలోమండలంలోనిఉన్నతపాఠశాలలప్రధానోపాధ్యాయులు,స్థానిక తెలుగుదేశంనాయకులు మాలేపాటినాగేశ్వరరావు,కాంద్రసతీష్ నాయుడు,కళాశాలసిబ్బందితదితరులుపాల్గొన్నారు.

## ఘనంగా పల్నాటి
## ఉద్యమ వీరుడు కన్నెగంటి హనుమంతు వర్ధంతి వేడుకలు



రెంటచింతల, మండల రిపోర్టర్ - శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): పల్నాటి ఉద్యమ వీరుడు కన్నెగంటి హనుమంతు వర్ధంతి వేడుకలను స్థానిక గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎస్ మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యావేత్త నారాయణపురం శ్రీనివాసరావు, పలువురు పాల్గొని హనుమంతు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. హనుమంతు బ్రిటిష్ వారితో ఏ విధంగా పోరాడి పుల్లరి ఉద్యమ నేతగా ఎదిగాడో ఈ సందర్భంగా శ్రీనివాసరావు విఫరించారు. పుల్లరి పోరాటం చేసి బ్రిటిష్ తూటాలకు నేలకొరిగిన ఉద్యమ వీరుడు హనుమంతు స్వాతంత్ర్య సమరానికి దారి



చూపిన గొప్ప స్వాతంత్ర్య పోరాట సమరయోధుడని కొనియాడారు. ఆ వీరుని పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మంచికల్లు గ్రామ సర్పంచ్ గోగుల పుల్లారెడ్డి 20 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## చదువుతోనే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చు : డాక్టర్ తాడివలస దేవరాజు



చీరాల, శుభోదయం న్యూస్ : ప్రతి ఒక్కరు దయ మరియు సహాయం చేసే గుణాన్ని కలిగి ఉండాలి.చీరాలలో సెయింట్ మార్స్ లూథరన్ కాలేజ్ నందు చదువుతున్న విద్యార్థులకు శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ తాడివలస దేవరాజు పెద్ద కుమారుడు తాడివలస జ్ఞానేశ్ బర్త్ డే సందర్భంగా పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులకు పౌష్టిక ఆహారం ఏర్పాటు చేసి వారికి మిడ్ డే మిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ తాడివలస దేవరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని, పేదవారికి సహాయం చేస్తూ సమాజ సేవలో పాల్గొనాలని తెలిపారు. ఈరోజు నేను చదువుకున్న కళాశాలలో విద్యార్థులతో కలవడం, వారికి సహాయం చేసే అదృష్టం కలగడం ఎంతో



సంతోషంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్ప్రిన్సిపాల్ గారపాటి పుష్ప రాజు, మంజుల,అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## విశ్రాంతరైల్వేఉద్యోగుల యానివర్స్ డే



(శుభోదయంన్యూస్ )బిట్రగుంట: బోగోలుమేజర్ పంచాయతీశ్రీషిరిడి సాయిబాబామందిరంలోనికళ్యాణమండపంలోశుక్రవారం ఆల్ ఇండియారైల్వేపెన్షనర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ బిట్రగుంటశాఖఅధ్యక్షుడు ఎస్.శ్రీనివాసులుఆధ్వర్యంలో5వయానివర్ దేవేడుకలుఘనంగా జరిగాయి.కార్యక్రమంలోపెన్షనర్స్ఎదుర్కొంటున్నవివిధసమస్యలపై చర్చించడంతోపాటు 80 సంవత్సరాలుపైబడినపెన్షనర్లకు బహుమతులుఅందజేశారు.పైకార్యక్రమంలోఆశాఖడివిజన్ నాయకులురామ్ గోపాల్,శ్రీనివాసరావు,కామేశ్వరరావు,సాయి కుమార్,కృపయ్య,సుబ్బారావులతోపాటురైల్వేహెల్త్ సూపరింటెండెంట్ ఐ.వి.రమణ,ఎస్బిఐబ్యాంకుమేనేజర్ చంద్రశేఖర్, యూనియన్ బ్యాంకుమేనేజర్ రామకృష్ణ, తదితరులుపాల్గొన్నారు.

## కాపు కళ్యాణ మండపంలో ఆంధ్ర ప్రభ టౌన్ రిపోర్టర్ బండ్రెడ్డి గోపి కుమార్తె చిరంజీవి వర్షిత నూతన వస్త్రాలంకరణ





(శుభోదయం న్యూస్) ఫిబ్రవరి21 బాపట్ల పట్టణం : ఆంధ్ర ప్రభ టౌన్ రిపోర్టర్ బండ్రెడ్డి గోపి కుమార్తె చిరంజీవి వర్షిత నూతన వస్త్రాలంకరణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వాదించిన బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ గారు మరియు పిట్లవానిపాలెం మండల అధ్యక్షులు హుస్సేన్ బిగ్ (దాదా ) బాపట్ల మండలం రూరల్ పార్టీ అధ్యక్షులు దాసరి ఏసుబాబు బాపట్ల ఏరియా వైద్యశాల డెవలప్మెంట్ సభ్యురాలు జిడుగు విజయ మాధురి గారు జిడుగు రాజేష్ %ఢ% సిగిరి శెట్టి సంజయ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం బలపరిచిన అభ్యరి శ్రీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి మొదటి ప్రాధాన్యత ఓటు



(శుభోదయం న్యూస్) ఫిబ్రవరి21 బాపట్ల పట్టణం: బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మరియు మహిళా కళాశాల నందు మేనేజ్మెంట్ మరియు ఉపాధ్యాయులతో సమావేశమై ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థి శ్రీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ గారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరిన బాపట్ల పార్లమెంట్ సభ్యులు లోక్ సభ ప్యానెల్ స్పీకర్ శ్రీ తెన్నేటి కృష్ణప్రసాద్.

## పేరాబత్తుల రాజశేఖరం గారిని భారీ మెజారిటీతో గెలిపించాలి - నగిరెడ్డి కాశీ నరేష్, రెడ్డి గౌరీ శంకర్




ఏలూరు, శుభోదయం న్యూస్ : ఏలూరు నియోజకవర్గంలోని 4,5, డివిజన్ పరిధిలోని వెన్నవల్లి వారి పేట, టీచర్స్ కాలనీ, లంబాడి పేట, శ్రీరాంనగర్ కాలనీ, చెంచుల కాలనీ, వినాయక నగర్, శివకామాక్షి కాలనీలో 35 వ డివిజన్ పరిధిలోని కొత్తపేటలో ఉన్న కంకణాల వారి వీధి, గొర్రెల వారి వీధి, 12 పంపుల సెంటర్ మెయిన్ రోడ్డులో, 40 వ డివిజన్ పరిధిలోని కరణం వారి వీధి, దాసరి వారి వీధి,లావేటి వారి వీధి, సబ్బులు వారి వీధిలో ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల ఏలూరు పార్లమెంటు సమన్వయకర్త, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ శ్రీ రెడ్డి అప్పల నాయుడు గారి ఆదేశాల మేరకు ఉభయ గోదావరి జిల్లాల కూటమి అభ్యర్థి శ్రీ పేరాబత్తుల రాజశేఖరం గారిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ నగిరెడ్డి కాశీ నరేష్, రెడ్డి గౌరీ శంకర్ గార్ల ఆధ్వర్యంలో శుక్రవారం విస్తృత ప్రచారాన్ని చేపట్టారు.. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల %మీజ% అభ్యర్థి శ్రీ పేరాబత్తుల రాజశేఖర్ గారికే మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని ఓటర్లను వారు ప్రార్థించారు.. ఈ నెల 27వ తేదీన జరగబోయే ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల %మీజ% ఎన్నికలలో %చీణా% కూటమి తరుపున పోటీ చేయనున్న శ్రీ పేరాబత్తుల రాజశేఖరం గారికి మొదటి ప్రాధాన్యతను ఓటును వేసి గెలిపించాలని స్థానిక కూటమి పార్టీల నాయకులతో కలిసి ఓటర్లను అభ్యర్థించి, వారికీ కరపత్రాలు అందించి పేరాబత్తుల రాజశేఖర్ గారికి మీ అమూల్యమైన మొదటి ప్రాధాన్యత ఓటును వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని వారు కోరారు.. ఈ కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి సరిది రాజేష్, కార్యదర్శి ఎట్రించి ధర్మేంద్ర, బొత్స మధు, నాయకులు వీరంకి పండు, బోండా రాము నాయుడు, కూనిశెట్టి మురళీ కృష్ణ, వేముల బాలు, 1 టౌన్ మహిళ కార్యదర్శి వెలగా గాయత్రి మరియు ఉమ్మడి కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, జనసైనికులు, మెగా అభిమానులు తదితరులు పాల్గొన్నారు..

## ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారార్థం పార్టీ క్యాడర్ తో సమావేశమైన ఎమ్మెల్యే బేబీనాయన గారు..!!!



విజయనగరం, జిల్లా ప్రతినిధి, బొద్దాన.శ్రీనివాస్.(శుభోదయం న్యూస్):కూటమి ప్రభుత్వం బలపరిచిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ గారుకి మద్దతుగా బొబ్బిలి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) పార్టీ క్యాడర్ తో సమావేశం జరిపి, దిశ నిర్దేశం చేశారు..పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ఎన్నికలో అందరూ కష్టపడి పనిచేసి కూటమి బలపరిచిన అభ్యర్థి గెలుపుకై కృషి చేయాలని తెలిపారు. అలాగే, అత్యధిక ఓటర్లు ఉన్న బొబ్బిలి పట్టణం, మరియు బొబ్బిలి మండలంలో ఈరోజు నుంచే ప్రచార భాద్యతలు తీసుకోవలసినదిగా పార్టీ శ్రేణులకు సూచించారు.ఈ సమావేశంలో బొబ్బిలి పట్టణం మరియు బొబ్బిలి మండలం ముఖ్య నాయకులు పాల్గొన్నారు..!!

## ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే బేబీనాయన మరియు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, నియోజకవర్గ పరిశీలకులు భంజ్ దేవ్..!!!



విజయనగరం, జిల్లా ప్రతినిధి, బొద్దాన. శ్రీనివాస్.(శుభోదయం న్యూస్):కూటమి బలపరిచిన అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తమ మద్దతు తెలపాలని కోరిన ఎమ్మెల్యే, బేబీనాయన.బొబ్బిలి పట్టణంలో గల డిగ్రీ కళాశాలలో ఈరోజు మధ్యాహ్నం స్థానిక ప్రైవేటు పాఠశాలలు, ప్రైవేటు జూనియర్ కళాశాలలు, ప్రైవేటు డిగ్రీ కళాశాలలు మరియు ఒకేషనల్ కాలేజీల ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) మరియు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, నియోజకవర్గ పరిశీలకులు శ్రీ భంజ్ దేవ్ సమావేశం నిర్వహించి కూటమి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ గారికి మొదటి ప్రాధాన్యత ఓటును వేయవలసినదిగా విజ్ఞప్తి చేశారు.గత రెండు పర్యాయాలు ఎమ్మెల్సీ గా పనిచేసినపాకలపాటి రఘువర్మ గారికి మరొక అవకాశం ఇచ్చి శాసన మండలిలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల తరుపున ప్రాతినిధ్యం వహించే అవకాశం కల్పించాలని కోరారు.!!



## : డ్వాక్రా మహిళ సంఘాల మెగా ఋణ మేల కార్యక్రమం



దోర్నాల మండల రిపోర్టర్- ఆవులయ్య ( శుభోదయం న్యూస్ ): ప్రకాశం జిల్లా,పెద్ద దోర్నాల మండలం లో మహిళా సమాఖ్య ఆఫీసులో నేడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దోర్నాల శాఖ ఆధ్వర్యంలో రుణమేల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్వో ఆఫీసు నుండి సహిర్ మాట్లాడుతూ మహిళాభివృద్ధి కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మహిళలను పారిశ్రామిక వేత్తలు గా తీర్చిదిద్దడానికి ముందుంటుందని అన్నారు. అర్హత కలిగిన మహిళా సంఘాలు అందరికీ రుణము ఇవ్వటానికి అన్నివేళలా ముందు ఉంటామని ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ యు బి ఐ దోర్నాల శాఖ పరిధిలో ఈరోజు కోటి 50 లక్షలు రూపాయలు స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే లఘుపతి దీదీ కి సంబంధించి ఒక్కొక్క సభ్యురాలికి లక్ష రూపాయలు చొప్పున పదిమందికి 10 లక్షలు చొప్పున రుణాలు మంజూరు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దోర్నాల యు బి ఐ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ బాలకృష్ణ అలాగే వై చర్లపల్లి బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్ వెంకటేష్ వరుణ్ ,మరియు దోర్నాల అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ దర్శనం పోలయ్య ,సిబ్బంది మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరపండి. ఎమ్మెల్యే ఉగ్ర ప్రతి భక్తుడికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడండి.



కనిగిరి రిపోర్టర్ జి. ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్) : శ్రీ నారాయణ స్వామి వారి దేవస్థానములో 67వ సప్తాహ్నిక మహాశివరాత్రి బ్రహ్మోత్సవములు సందర్భంగా కనిగిరి శాసన సభ్యులు శ్రీ ముక్కు ఉగ్రనరసింహరెడ్డి గారు దేవస్థానమును సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవములు సందర్భంగా దేవస్థానమునకు వచ్చు ప్రతిభక్తుడికి ఎటువంటి



అసౌకర్యము కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీగిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్నఆదినారాయణ వార్లను ఆదేశించారు. ఏర్పాట్లలో భాగంగా భక్తులకు త్రాగు నీటి సౌకర్యము, భక్తులు ఎండకు ఇబ్బందిపడకుండా ఎక్కడిఅక్కడ టెంట్లు మరియు టాయిలెట్స్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవముల తదుపరి అభివృద్ధి కార్యక్రమములలో భాగంగా దేవస్థానము యొక్క మాస్టరు ప్లాను తయారు చేయించవలెను అని కార్యనిర్వహణాధికారి గారిని ఆదేశించారు. అదేవిధముగా అలయముగా చెట్లు ఏక్కువుగా పెంచాలని ఆదేశించారు. తదుపరి శ్రీ స్వామి వారి ధర్వాజ ముఖద్వారమునకు 30 కేజీల వెండితోడుగు చేయించిన దాతలను అభినందించారు. ఈ కార్యక్రమములో కొమ్మినేని వెంకటరావు మరియు మండల నాయకులు గ్రామస్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశ కార్యక్రమం లో పాల్గొన్న గూడూరి ఎరిక్షన్ బాబు



ఎర్రగొండపాలెం మండల్ రిపోర్ట్ నారాయణ (శుభోదయం న్యూస్):యర్రగొండపాలెం పట్టణంలోని దేవతి రామకృష్ణ గారి నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్-చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు గారు...టిడిపి కూటమి నాయకులు.

## సింగరాయకొండ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఒంగోలు ఉప విద్యాధికారి



సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్):- సింగరాయకొండ, ప్రకాశం జిల్లా: ఒంగోలు ఉప విద్యాధికారి శ్రీ ఏ. చంద్రమౌళీశ్వర్ శుక్రవారం సింగరాయకొండ బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా తరగతుల నిర్వహణను పరిశీలించి, తరగతులలో విద్యార్థినులను చదివించి, బోధనా ప్రమాణాలను సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థినులకు పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కీలక సూచనలు చేశారు.అదే విధంగా, శ్రీమతి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి, భోజనాన్ని రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు.తదనంతరం పాఠశాల సిబ్బందితో సమావేశం నిర్వహించి, పదవ తరగతి విద్యార్థినుల కోసం ఉపాధ్యాయులు తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శకాలను ఇచ్చారు. ఉపాధ్యాయులు తీసుకుంటున్న చర్యల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, పాఠశాల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధాన ఉపాధ్యాయిని శ్రీమతి జె. మాధవి, బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్టీ సెల్ ఏపీ రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎం దారు నాయక్ కు దోర్నాల్లో సన్మానం



దోర్నాల మండల రిపోర్టర్- ఆవులయ్య (శుభోదయం న్యూస్ ):ప్రకాశం జిల్లా, పెద్ద దోర్నాల మండలం రాష్ట్ర అధ్యక్షులు టిడిపి ఎస్టీ సెల్ ఏపీ రాష్ట్ర స్టేట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎం దారు నాయక్ భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు శ్రీశైలం వెళుతున్న సందర్భంగా దోర్నాల్లో మర్యాదపూర్వకముగా కలిసి రిటైర్డ్ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు జి గాలే నాయక్, అడ్వైజర్ నెంబర్ భూమని మంతన్న , డి శ్రీను నాయక్, లు పూల మాలలతో శాలువలతో శుక్రవారం దోర్నాల్లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు పరిచారన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని. గ్రామాలలో సిమెంట్ రోడ్లు నిర్మించారన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయినప్పటినుండి ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలను 70% శాతం అమలు చేశారని అన్నారు. 1 వ తేదీ నా పింఛన్లను పంపిణీ చేశారన్నారు. 20 లక్షల ఉద్యోగాల ప్రణాళికను తయారు చేశారన్నారు. ప్రజలందరికీ అందుబాటులో ఇసుకను ఉంచారని అన్నారు. ఎవరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇసుక అందరికి అందుబాటులో ఉందని తెలిపారు. వైయస్ఆర్ ప్రభుత్వము సంక్షేమ పథకాలను గాలికి వదిలేసారు. అన్నారు. రాష్ట్రాన్ని అభాష్ పాలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు జి గాలే నాయక్, అడ్వైజర్ నెంబర్ బి మంతన్న, డి శ్రీను నాయక్ ,తదితరులు పాల్గొన్నారు.

## సింగరాయకొండ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు

సింగరాయకొండ మండల రిపోర్టర్ పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్):- సింగరాయకొండ, ప్రకాశం జిల్లా: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ ఆధ్వర్యంలో సింగరాయకొండ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో (బాలికలు) 2025-26 విద్యాసంవత్సరానికి ప్రవేశాల ప్రకటన విడుదలైంది.ప్రవేశ వివరాలు:

5వ తరగతి (ఇంగ్లీష్ మీడియం) - 80 సీట్లు

ఇంటర్మీడియట్ (ఇంగ్లీష్ మీడియం):

ఎంపీసీ - 40 సీట్లు బైపీసీ -40 సీట్లు సీఈసీ - 80 సీట్లు

దరఖాస్తు ప్రక్రియ:

ఆరంభ తేదీ: 7 ఫిబ్రవరి 2025 ముగింపు తేదీ: 6 మార్చి 2025

అధికారిక వెబ్సైట ప్రవేశ పరీక్ష తేదీ: 6 ఏప్రిల్ 2025

5వ తరగతి పరీక్ష: ఉదయం 10:00 - 12:00

ఇంటర్మీడియట్ పరీక్ష: మధ్యాహ్నం 2:00 - 4:30

ప్రత్యేక సూచనలు:

అభ్యర్థులు అధికారిక వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని, మరింత సమాచారం కోసం సంబంధిత పాఠశాల లేదా కళాశాల ప్రిన్సిపాల్ను సంప్రదించాలని సూచించారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తాయి. అర్హులైన విద్యార్థినులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు తెలిపారు.అసెంబ్లీ సమావేశాల్లో

## అగ్రిగోల్డ్ ఆస్తులు రక్షించి మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అగ్రిగోల్డ్ ఆస్తులు అమ్మి త్వరగా బాధితులకు సత్వర న్యాయం చేయండిలి

అగ్రిగోల్డ్ కస్టమర్స్ అంటే

ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి తిరుపతిరావు



సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్ ):-అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 21 22025 గౌరవనీయులు మంత్రివర్యులు అయినటువంటి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి గారి కార్యాలయంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది.తిరుపతి రావు మాట్లాడుతూసమర్థ అధికారుల బృందంతో ప్రత్యేక కమిటీ (ఎస్పివి)ని ఏర్పాటుచేసి బాధితుల సమస్యల పరిష్కారించాలని,అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయించి, జప్తు చేసిన ఆస్తులన్నింటిని కోర్టులో అబ్సెల్యూట్ చేయించాలనీ కోరారు.జప్తు చేసిన ఆస్తుల రక్షణ బాధ్యతను సి.ఐ.డి. చీఫ్ పర్యవేక్షణలో మండల రెవెన్యూ, పోలీసు అధికారులకు అప్పగించి కాపాడాలనీ కోరారు.అసెంబ్లీ సమావేశాల్లో అగ్రిగోల్డ్ బాధితుల విషయం పై చర్చించి బడ్జెట్ కేటాయించి సత్వర న్యాయం చేయించాలని కోరారు.అత్యవసర వైద్యం, విద్య, బిడ్డల పెళ్ళిళ్ళు లాంటి అవసరాలు ఉన్నవారికి, లక్షలోపు డిపాజిట్ చేసిన చిన్న పొదుపుదారులకు తక్షణ చెల్లింపులకు తగిన ఏర్పాట్లుచేసి మరో డిపాజిట్టాదారుడు బలికాకుండా అదుకోవాలనీ కోరారు.ప్రజాప్రతినిధిగా తమరు తమ పలుకుబడిని ఉపయోగించి ఆయా వేదికలలో ఈ బాధితుల సమస్యలను ప్రస్తావించుటతోపాటు, గౌరవ సి.యం., డిప్యూటీ సి.యం. గార్లకు తమ పేరుతో లేఖలు పంపి త్వరితగతిన మన నియోజకవర్గంలోని బాధితులకు న్యాయం చేకూర్చమని విజ్ఞప్తి చేశారు గౌరవ మంత్రివర్యులు కూడా సానుకూలంగా స్పందించడం జరిగింది ఆర్లెడీ ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించాలని ఆలోచన చేస్తా ఉందని తనవంతుగా ముఖ్యమంత్రి గారి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తానని కచ్చితంగా ఈ సమస్యను ప్రభుత్వం పరిష్కరిస్తుంది తెలియజేశారు ఈ కార్యక్రమంలో జీవి ప్రసాద్ గారు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాయుడు శ్రీనివాసరావు గారు జిల్లా తిరుమల శ్రీనివాసులు రెడ్డి రమేష్ చంద్ర రమణయ్య జయ నందరావ్ సత్యనారాయణ వాసు దాసు సభ్యులు అనేకమంది పాల్గొన్నారు

## మంత్రి సీతక్కకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం బిపురెడుపల్లి గ్రామస్తులు



మంగపేట, మండల రిపోర్టర్ - తులసి (శుభోదయం న్యూస్):మంగపేట మండలం పురేడుపల్లి గ్రామంలో ఇందిరమ్మ



ఇల్లు పథకం కింద 119 ఇల్లులు అమలు కావడం వలన పురేడిపల్లి గ్రామస్తులు మర్యాద పూర్వకంగా మంత్రి సీతక్క ను కలిసి సన్మానించడం జరిగింది. తదనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ మంత్రి సీతక్క కృషి వలెనే మా గ్రామంలో119 ఇల్లులు అమలు చేశారు ఇందుకుగాను మంత్రి సీతక్కకు కాంగ్రెస్ ప్రభుత్వానికి మేము ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలియజేస్తున్నాం అని గ్రామస్తులు అన్నారు.. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు పూనం నరసయ్య,ఎస్కే అజ్మత్ సింగ నర్సింగరావు, తోలం నాగబాబు, పెద్దల నరేష్, పాయం అనిత, మల్కం ఉమారాణి,ఎట్టి పార్వతి, ఎండి బషీరా,మల్కం నవీన,మంద రమణ, వజ్జ నర్సమ్మ.

## పిఏసిఎస్ చైర్మన్ ను సన్మానించిన అంబేద్కర్ సంఘం నాయకులు



వరంగల్: (శుభోదయం న్యూస్ ): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ల పదవి కాలం ఆరు నెలలు పొడగించినందున ఇట్టి సందర్భాన్ని పురస్కరించుకొని ఈరోజు పర్వతగిరి మండలం చౌటపల్లి సొసైటీ చైర్మన్ గొర్రె దేవేందర్, డైరెక్టర్ గోపాల్ రావు లను చైర్మన్ వారి కార్యాలయంలో అంబేద్కర్ సంఘం నాయకులు శాలువాలతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నరసయ్య జిల్లా కో కన్వీనర్ జంగిలి భాస్కర్ నాయకులు జేరిపోతుల కుమార స్వామి పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

## స్థానిక ఎన్నికలలో యూత్ కాంగ్రెస్ నాయకులు చురుగ్గా పాల్గొనాలి

## యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్...



వరంగల్:(శుభోదయం న్యూస్ ):పర్వతగిరి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్ మాట్లాడుతూ పదేళ్ల తర్వాత వచ్చిన పేదల ప్రభుత్వం పది కాలాలపాటు మనుగడ సాధించాలంటే ప్రతి యువజన కాంగ్రెస్ కార్యకర్త గ్రామాల్లో ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలి. మీ గ్రామంలో మీరే మంత్రి, ఎమ్మెల్యే, కథ నాయకుడిగా భావించి మూడు రంగుల జెండాను ముందుకు తీసుకువెళ్లాలి.అధికారంలో లేని పదేళ్లలో మనం పడిన ఇబ్బందులు గుర్తు చేసుకుంటూ చేతికి అంది వచ్చిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అర్హులకు చేర్చేందుకు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తిరుగులేని ఆదిపత్యాన్ని కనబరచాలి. మొదటి ఏడాదిలోనే ఎవరి ఊహకందని పథకాలు ప్రతిగడపకు చేర్చాం. అవినీతి, అక్రమం అనే మాట తలెత్తకుండా ప్రభుత్వం ముందుకు పోతుంది. ప్రజా ప్రభుత్వం పనితీరుతో ప్రతిపక్షాల ఆర్తనాదాలు ప్రజలు పట్టించుకునే పరిస్థితి లేదు. వారి ఆశలు ఆవిరి అయిపోయాయి.పార్టీ గెలుపులో యువజన కాంగ్రెస్ నాయకుల పాత్ర కీలకమని రాబోవు స్థానిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ సత్తా చాటేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి వెళ్ళేలా యువజన నాయకులు కృషి చేయాలన్నారు. అదేవిధంగా యువజన విభాగం తరుపున విస్తృతంగా సేవా కార్యక్రమాలను చేపట్టాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్ కోరారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి భూక్య విజేందర్ నాయక్, యూత్ కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ అధ్యక్షులు కొమ్ము రమేష్, యూత్ కాంగ్రెస్ పర్వతగిరి మండల ఉపాధ్యక్షులు భూక్య సురేందర్, మూడు దేవరాజ్, యూత్ కాంగ్రెస్ పర్వతగిరి మండల మాజీ అధ్యక్షులు నీరటి ప్రశాంత్, మైనార్టీ నాయకులు యాకూబ్ పాషా, యూత్ కాంగ్రెస్ మండల నాయకులు పిట్టల లోకేష్, నూనె మణికంఠ, వంగ సాయి తదితరులు పాల్గొన్నారు.

## కన్నతల్లి లాంటి తెలుగును అందరికీఅందించాలి

## మడికొండ హెడ్ కానిస్టేబుల్ జయరాజ్...



, వరంగల్ (శుభోదయం న్యూస్ )::అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఇంగ్లీష్ మోజులో పడి కన్నతల్లి లాంటి తెలుగు భాష కొంచెం కొంచెం కనుమరుగవుతున్న బాధతో తెలుగును మర్చిపోవద్దు అని నా వంతు కృషిగా నేను ఉద్యోగం చేయుచున్నటువంటి ప్రభుత్వ పాఠశాలల నందు పెద్ద బాలశిక్ష పుస్తకాన్ని అందిస్తూ ఉంటాను. అదేవిధంగా ఈరోజు కాజీపేట మండలం కుమ్మరిగూడెం గ్రామంలో ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పెద్దబాలశిక్ష పుస్తకాన్ని స్కూలుకు అంకితం ఇవ్వడం జరిగింది అదేవిధంగా మిగతావారు కూడా మన కన్న తల్లి లాంటి తెలుగును అందరికీ అందించాలని నా యొక్క ప్రార్థన, కోరిక అని పోలీస్ హెడ్ కానిస్టేబుల్ మడికొండ పోలీస్ స్టేషన్ జి జయరాజు తెలిపారు.

## మావోయిస్టు పార్టీ

## కేంద్ర కమిటీ సభ్యుడి ప్రొటెక్షన్ గ్రూప్ కమాండర్ లొంగుబాటు




వరంగల్ జిల్లా, (శుభోదయం న్యూస్ ): నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ గొత్తికొయ ఏరియా కమిటీ సభ్యురాలు, కేంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారయణ రెడ్డి ఆలియాస్ కొసా ప్రొటెక్షన్ గ్రూప్ కమాండర్ వంజెం కేషా ఆలియాస్ జిన్ని శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఎదుట లొంగిపోయింది.ఈ లొంగుబాటుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ వివరాలను వెల్లడిస్తూ ఛత్తీస్‌గడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా, పామెడ్ మండలం, రాసపల్లి గ్రామానికి చెందిన వంజెం కేషా తండ్రి హిడ్మా కూడా (ప్రస్తుతం ఇతను జైలులోవున్నాడు) మావోయిస్టు పార్టీలో పనిచేసేవాడు. దీనితో కేషా కూడా బాల్యంలో చైతన్య నాట్య మండలి పనిచేయడంతో మావోయిస్టు పార్టీకి చెందిన సభ్యులతో పరిచయాలు కావడంతో 2017లో పామెడ్ లోకల్ స్క్వాడ్ కమాండర్ గొట్టే కమల ద్వారా మావోయిస్టు పార్టీలో చేరిన కేషా రెండు సంవత్సరాలు పాటు పున్నెం జోగ అధ్వర్యంలో చైతన్య నాట్యమండలిలో పనిచేసింది. ఇదే సంవత్సరం కేషాను పార్టీ నాయకత్వం అబుజ్‌మడ్ ప్రాంతానికి బదిలీ చేసి కేంద్ర కమిటీ సభ్యుడు కడారీ సత్యనారయణ రెడ్డికి ప్రొటెక్షన్ గ్రూప్ సభ్యురాలిగా నియమించింది. 2021 సంవత్సరంలో కేంద్ర మవోయిస్టు నాయకత్వం కేషాను ఏరియా కమిటీ సభ్యురాలిగా నియమించడం జరిగింది. 2022 డిసెంబర్ వరకు ప్రొటెక్షన్ గ్రూప్ సభ్యురాలిగా పనిచేసి కేషా మరో మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యుడు రమేష్‌ను (ప్రస్తుతం మహరాష్ట్ర జైలులో వున్నాడు) వివాహం చేసుకోని ఉత్తర బస్తర్ డివిజన్లో కొద్ది కాలం పనిచేసింది. అనంతరం 2024 ఎప్రిల్ మాసంలో తిరిగి కంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారయన రెడ్డి ఆలియాస్ కొసా ప్రొటెక్షన్ గ్రూప్ మహిళా కమాండర్ బాధ్యతలు చేపట్టింది. పాల్పడిన నేరాల వివరాలుపార్టీలో పనిచేసిన సమయంలో కొహిలబేడా పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టు పార్టీ సభ్యులతో కల్సి పోలీసులపై కాల్పులు జరపడంతో ఒక పోలీస్ అధికారి మరణించగా మరో పోలీస్ అధికారి తీవ్రంగా గాయబడిన సంఘటనతో పాటు, అబుజ్‌మడ్‌లో ప్రాంతంలో పోలీసులపై జరిపిన కాల్పుల్లో ఒక పోలీస్ అధికారి మరణించాడు. ఈ రెండు సంఘటనల్లో వనజం కేషే నిందితురాలు. లొంగుబాటుకు గల కారణాలుతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లొంగిపోయిన మావోయిస్టు పార్టీ సభ్యులకు అందిస్తున్న పునరావాస పథకాలకు అకర్షితులుకావడంతో పాటు, ప్రధానంగా తాను సురక్షితంగా లొంగుబాటు అయ్యేందుకు పూర్తి సహయ సహకారాలు అందిస్తామని వరంగల్ కమిషనరేట్ పోలీస్ అధికారులు ఇచ్చిన వాగ్దనంతో పాటు ప్రస్తుతం మావోయిస్టు పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత రావడం, ఆరోగ్యం కుడా సహకరించక పోవడంతో కేషా లొంగిపోయిందని. పోలీసుల ఎదుట లొంగిపోయిన వంజెం కేషాపై 4లక్షల రూపాయల ప్రభుత్వ రివార్డు వున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ వెల్లడిరచారు.

# : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం - తెలుగు భాష ప్రాముఖ్యత

## తెలుగు భాషా దినోత్సవం



హైదరాబాద్, శుభోదయం న్యూస్ : (తెలుగు భాషా దినోత్సవంబీ తెలుగు భాష దినోత్సవం) ప్రతి సంవత్సరం ఆగస్టు 29న ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో జరుపుకుంటారు. తెలుగు కవి గిడుగు వెంకట రామమూర్తి పుట్టినరోజుతో సమానంగా ఈ తేదీని ఎంచుకున్నారు. భారతదేశంలోని ప్రధాన భాషలలో ఒకటైన తెలుగు, దేశ సృజనాత్మక ఆత్మను రూపొందించడంలో కీలక పాత్ర పోషించింది. వేల సంవత్సరాల నాటి గొప్ప సాహిత్య మరియు సాంస్కృతిక వారసత్వంతో, తెలుగు భారతదేశం యొక్క కళాత్మక మరియు సృజనాత్మక ప్రకృతి దృశ్యంలో అంతర్భాగంగా ఉంది. ఇది ద్రావిడ భాషా కుటుంబంలో అత్యంత ప్రజాదరణ పొందిన శాఖ. ఇది ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల అధికారిక భాష మరియు ప్రధానంగా ఆగ్నేయ భారతదేశంలో మాట్లాడబడుతుంది. 21వ శతాబ్దం ప్రారంభంలో తెలుగు మాట్లాడేవారి సంఖ్య 75 మిలియన్లు.ప్రపంచ భాషగా తెలుగుప్రపంచంలోని పురాతన భాషలలో తెలుగు ఒకటి. దాని మూలాలు విభిన్నంగా ఉన్నాయి మరియు భారతదేశంలో భాషా రాష్ట్రాల స్థాపనకు దారితీసిన రాజకీయ ఆందోళనలకు ఇది కేంద్రంగా ఉంది. ఒక అమెరికన్ థింక్-ఆర్గనైజేషన్ నిర్వహించిన అధ్యయనం ప్రకారం. యునైటెడ్ స్టేట్స్లో తెలుగు అత్యంత వేగంగా విస్తరిస్తున్న భాష. ఇది దక్షిణాఫ్రికాలో కూడా రక్షిత భాష. గత ఏడు సంవత్సరాలలో, తెలుగు మాట్లాడే వారి సంఖ్య 86% పెరిగింది. ఒక సంవత్సరంలో 400,000 కంటే ఎక్కువ మంది తెలుగు మాట్లాడేవారు యునైటెడ్ స్టేట్స్లో నివసించారు, 2010లో ఈ సంఖ్య దాదాపు రెట్టింపు అయింది. అమెరికాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న టాప్ 10 భాషలలో ఏడు దక్షిణాసియాకు చెందినవి. అయితే, ఇది ఇంగ్లీష్ కాకుండా విస్తృతంగా మాట్లాడే టాప్ 20 భాషల వెలుపల ఉంది.తెలుగు మరియు భారతీయ గుర్తింపుతెలుగు ప్రజలకు విశాలమైన భారతీయ గుర్తింపుకు దోహదపడే విలక్షణమైన సాంస్కృతిక గుర్తింపు ఉంది. వారికి పురాతన కాలం నాటి ప్రత్యేకమైన సాహిత్య సంప్రదాయం ఉంది, ఇందులో విస్తారమైన శాస్త్రీయ సాహిత్యం మరియు కవిత్వం ఉన్నాయి. తెలుగు శాస్త్రీయ భాష భారతీయ సాహిత్యం, కళలు మరియు తత్వశాస్త్రంపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. అదే సమయంలో, తెలుగు ప్రజలు విభిన్న భాషా, మత మరియు ప్రాంతీయ నేపథ్యాల నుండి వచ్చిన వ్యక్తులతో సహా విభిన్న భారతీయ జనాభాలో అంతర్భాగం. భారతదేశ జాతీయ గుర్తింపు వైవిధ్యంలో ఏకత్వాన్ని నొక్కి చెబుతుంది, దాని సరిహద్దులలో సహజీవనం చేసే అనేక సంస్కృతులు మరియు సంప్రదాయాలను గుర్తిస్తుంది మరియు జరుపుకుంటుంది.భారత ప్రభుత్వం తెలుగును ఆరు శాస్త్రీయ భాషలలో ఒకటిగా గుర్తించింది. భారతదేశంలో అత్యధికంగా మాట్లాడే భాషలలో తెలుగు 4వ స్థానంలో ఉంది. ఇది ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే 14వ స్థానిక భాష. ఆధునిక ప్రామాణిక తెలుగు దాని మూలాలను కోస్తా ఆంధ్రలోని కృష్ణ-గోదావరి డెల్టా ప్రాంతంలోని స్థానిక భాషలో కలిగి ఉంది.తెలుగు శాస్త్రీయ సాహిత్యంతెలుగు పురాతన కాలం నాటి శక్తివంతమైన సాహిత్య సంప్రదాయాన్ని కలిగి ఉంది. ఇది కవిత్వం, ఇతిహాసాలు, నాటకాలు మరియు తాత్విక రచనలతో సహా విస్తారమైన సాహిత్యాన్ని సృష్టించింది. తెలుగు సాహిత్యం పద్యం, నవల లేదా నాటకం యొక్క ఏ శైలిలోనైనా వివిధ రకాల రచనలను కలిగి ఉందని రుజువు చేయబడింది, దీనిని ప్రబంధం, కావ్యం, దానిలో పద్య కావ్యం, గద్య కావ్యం మరియు కంద కావ్యం (చిన్న కవితలు), కవిత, అవధానం, నవల, కథ మరియు నాటకం (సంకలనం) ఉన్నాయి. 16వ మరియు 17వ శతాబ్దాల మధ్య తెలుగు సాహిత్యం స్వర్ణయుగంగా వర్ధిల్లింది. ఆ కాలంలో శ్రీ కృష్ణదేవరాయలు తెలుగు సాహిత్యంపై ఆసక్తి చూపారు. శ్రీ కృష్ణ దేవరాయల ఆముక్తమాల్యద కాకుండా, పెద్దన రాసిన మనుచరిత్ర ఒక అసాధారణమైన మహాకావ్యం.ఆధునిక తెలుగు సాహిత్య పితామహుడు కందుకూరి వీరేశలింగం పంతులు. వేక్ ఫీల్డ్ వికార్ కు ప్రతిస్పందనగా రాజశేఖర చరితము అనే నవల రాశాడు. సామాజిక అన్యాయాలు మరియు నమ్మకాలను ఎదుర్కోవడానికి సాహిత్యాన్ని ఉపయోగించిన మొదటి మరియు గొప్ప ఆధునిక రచయిత. ఆయన తర్వాత వచ్చిన ఇతర ప్రముఖ తెలుగు రచయితలలో రాయప్రోలు సుబ్బారావు, గురజాడ అప్పారావు, విశ్వనాథ సత్యనారాయణ, జాషువా, దేవులపల్లి కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, పుట్టపర్తి నారాయణా చార్యులు, ఇంకా చాలా మంది ఉన్నారు.

### తెలుగు భాష మరియు భాషా వారసత్వం:

తెలుగుకు బలమైన భాషా వారసత్వం ఉంది మరియు దాని పరిరక్షణ మరియు ప్రచారం భారతదేశ సాంస్కృతిక వైవిధ్యం మరియు భాషా గొప్పతనాన్ని కాపాడుకోవడానికి కీలకమైనవి. భారత ప్రభుత్వం 2008లో తెలుగును శాస్త్రీయ భాషగా ప్రకటించింది, దాని చారిత్రక ప్రాముఖ్యత, గొప్ప సాహిత్యం మరియు భారతీయ సంస్కృతికి చేసిన కృషిని గుర్తించింది. ఇది భారతదేశంలోని 22 షెడ్యూల్డ్ భాషలలో ఒకటి మరియు గొప్ప భాషా వారసత్వాన్ని కలిగి ఉంది. తెలుగులో అనేక ప్రాంతీయ మాండలికాలు ఉన్నాయి, ప్రతి దాని ప్రత్యేక భాషా లక్షణాలు ఉన్నాయి. ప్రధాన మాండలికాలలో రాయలసీమ, కోస్తాంధ్ర, తెలంగాణ మరియు వదరి ఉన్నాయి. తెలుగు లిపి శతాబ్దాలుగా అనేక మార్పులకు గురైన సిలబిక్ వర్ణమాల. తెలుగు లిపి అని పిలువబడే ప్రస్తుత లిపి, పురాతన బ్రాహ్మి లిపి నుండి ఉద్భవించింది మరియు ఎడమ నుండి కుడికి వ్రాయబడింది. కాలక్రమేణా తెలుగు వివిధ భాషలు మరియు సంస్కృతులచే ప్రభావితమైంది. వివిధ ప్రాంతాలు మరియు సామ్రాజ్యాలతో చారిత్రక పరస్పర చర్యల కారణంగా ఇది సంస్కృతం, పర్షియన్, అరబిక్, టర్కిష్, ఇంగ్లీష్ మరియు ఇతర భాషల నుండి పదాలను తీసుకుంది.

### సమకాలీన కాలంలో తెలుగుఆధునిక విద్య మరియు మీడియాలో

తెలుగు భాష మరియు సాహిత్యం ముఖ్యమైన పాత్రలను పోషిస్తున్నాయి, సాంస్కృతిక గుర్తింపు, భాషా అభివృద్ధి మరియు ప్రాంతీయ ప్రాతినిధ్యాన్ని పెంపొందిస్తాయి. సమకాలీన ప్రపంచంలో ప్రజలు సంభాషించే, నేర్చుకునే మరియు సంభాషించే విధానాన్ని అవి రూపొందిస్తూనే ఉన్నాయి. తెలుగు భాషా వార్తాపత్రికలు, మ్యాగజైన్లు మరియు జర్నల్స్ ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలో విస్తృత పాఠకులను కలిగి ఉన్నాయి. ఎలక్ట్రానిక్ మీడియాలో తెలుగును విస్తృతంగా ఉపయోగించడం ఆధునిక సమాజంలో దాని ఉనికిని మరింత బలపరుస్తుంది. ఇంటర్నెట్ మరియు డిజిటల్ ప్లాట్ఫారమ్ల పెరుగుదలతో, తెలుగు భాషా కంటెంట్ ఆన్లైన్లో ఆకర్షణను పొందుతోంది. తెలుగులో వెబ్సైట్లు, బ్లాగులు మరియు సోషల్ మీడియా ప్లాట్ఫారమ్లు వార్తలు మరియు విద్య నుండి వినోదం మరియు జీవనశైలి వరకు విభిన్న ఆసక్తులను తీరుస్తాయి.

### ముగింపు:

నిస్సందేహంగా, తెలుగు దాని గొప్ప సాహిత్య వారసత్వం, కళాత్మక వ్యక్తీకరణలు మరియు సినిమా మరియు ఇతర కళారూపాలకు గణనీయమైన సహకారాలతో భారతదేశ సృజనాత్మక ఆత్మను రూపొందించడంలో కీలక పాత్ర పోషించింది. తెలుగు భాష మరియు సంస్కృతి అభివృద్ధి చెందుతూనే ఉంది, సృజనాత్మకతకు స్ఫూర్తినిస్తుంది మరియు భారతీయ సృజనాత్మకత యొక్క విభిన్న వస్త్రాలను సుసంపన్నం చేస్తుంది. డిజిటల్ అక్షరాస్యతను ప్రోత్సహించడం, అధిక-నాణ్యత కంటెంట్ను సృష్టించడం, వినియోగదారు-స్నేహపూర్వక డిజిటల్ సాధనాలను అభివృద్ధి చేయడం మరియు తెలుగు వారసత్వాన్ని కాపాడుకోవడం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడం వంటివి డిజిటల్ యుగంలో తెలుగు వృద్ధిని నిర్ధారించడానికి తీసుకోగల కొన్ని చర్యలు.డాక్టర్ సాల్మన్ రాజు యార్లగడ్డఎం.ఎ. (ఇంగ్లీష్) ఎం.ఫిల్, పిహెచ్డి ఎపి-సెట్ యుజిసి- నెట్ ఆంగ్ల భాషా ఆచార్యులుఆంగ్ల విభాగంచైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీహైదరాబాద్ - 500075

## : పోస్ట్ ఆఫీస్ సేవలు మా బతుకుల్లో వెలుగులు నింపాయి

## ప్రమాద బీమా పొందిన కుటుంబ సభ్యులు



, సంగెం (శుభోదయం న్యూస్ ): మండలంలోని తీగరాజుపల్లి గ్రామానికి చెందిన సూత్రపు సదయ్య గత కొద్ది రోజుల క్రితం ద్విచక్రపాహనంపై వెళుతుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పోస్టల్ ఇన్సూరెన్స్ అధికారులు ఈరోజు తీగరాజు పల్లి గ్రామానికి చేరుకొని సదయ్య కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్ డబ్బులను సదయ్య.భార్య స్వరూప కుమారుడు రఘు కు 10 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఇట్టి పోస్టల్ ఇన్సూరెన్స్ పై అవగాహన కల్పించి ఇన్సూరెన్స్ చేయించిన బిపిఎం ఇటికాల శ్రీధర్ ను ఎస్ పి ఓ ఎస్ వరంగల్, రవికుమార్ , అభినందించారు. పోస్ట్ ఆఫీస్ సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని గ్రామ బ్యాంకు అయిన పోస్ట్ ఆఫీస్ ను సద్వినియోగం చేసుకోవాలని ఐపిపిబి మేనేజర్ ప్రమోద్ తెలియజేశారు. ఈ అవగాహన సదస్సుతో ప్రజలకు పోస్ట్ ఆఫీస్ సేవల గురించి పూర్తిగా అర్థమైనట్లు గ్రామస్తులు తెలియజేశారు ఈ విషయం తెలియక ఎన్నో బ్యాంకుల చుట్టూ తిరిగి నానా ఇబ్బందులు పడ్డట్లు అవగాహన సదస్సుకు హాజరైన నాయకులు ప్రజలు తెలియజేశారు. ఇకనుండి పోస్ట్ ఆఫీస్ సేవలనే కచ్చితంగా వినియోగించుకుంటామని ఇలాంటి అవగాహన సదస్సు కలిగించి పోస్ట్ ఆఫీస్ సేవల గురించి వివరించినందుకు పోస్ట్ ఆఫీస్ కు సంబంధించిన ఎస్ పి ఓ ఎస్ రవికుమార్ ,ఐ పీ ఓ సైదా నాయక్, ఐపిపిబి మేనేజర్ ప్రమోద్, పోస్ట్ ఆఫీస్ డిపార్ట్మెంట్ అధికారులను ప్రజలు అభినందించారు ఈ కార్యక్రమంలో ఐపిపిబి మేనేజర్ ప్రమోద్, ఐపిపిబి ఉదయ్, ఎగ్జిక్యూటివ్ లింగమూర్తి, అశోక్, నరేష్, బి పి ఎం శ్రీధర్, బిపిఎన్ ఎల్లయ్య, పోస్టల్ సిబ్బంది,బజాజ్ ఇన్సూరెన్స్ గ్రూప్ సభ్యులు, గ్రామ మాజీ సర్పంచ్ రమా గోపాల్, మాజీ ఎంపీటీసీ నరసింహస్వామి, సొసైటీ డైరెక్టర్ భాస్కర్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## : మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల గోడ పత్రిక ఆవిష్కరణ

## ...పోస్టర్ ఆవిష్కరించిన దేవస్థాన కమిటీచైర్మెన్, కమిటీ సభ్యులు...




సంగెం :(శుభోదయం న్యూస్ ): పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా దేవస్థాన కమిటీ చైర్మన్ కందగట్ల నరహరి మాట్లాడుతూ సంగెం మండల కేంద్రంలోని సంగమేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం 23-02-2025 నుండి మహా శివరాత్రి బ్రహ్మోస్తవాలు ప్రారంభం అవుతు 27-02-2025 గురువారం వరకు కార్యక్రమములు నిర్వేంచబడును.మహాశివరాత్రి బుధవారం 26-02-2025 రాత్రి 1-15 నిమిషాలకు శివపార్వతుల కళ్యాణం జరుగుతుంది. సాయంత్రం 8గంటలకు శివాలయం దగ్గర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వేంచబడును అని అన్నారు.ఈ కార్యక్రమం లో దేవాలయ ప్రధాన కార్యదర్శి ఆగపాటి రాజు (ఏ పి ఆర్ ), స్థానిక పూజారి అప్పే నాగార్జున శర్మ, మెట్టిపెల్లి రమేష్, మాజీ సర్పంచ్ గుండేటి బాబు, మాజీ ఎం పి టి సి మెట్టిపెల్లి మల్లయ్య, కోడూరి సధయ్య,మును కుంట్ల కోటేశ్వర్,కక్కెర్ల శరత్,మెట్టిపెల్లి శేఖర్, మునుకుంట్ల మోహన్, పులి సాంబయ్య, ఇప్పకాయల మనోహర్, లవ్ కుమార్, గుండేటి రాజు, నల్లతీగల రవి,ఉండిలా మల్లికార్జున్,అప్పాల కవిత,ఆగపాటి రామకృష్ణ, మెట్టిపల్లి సునీల్, గుండేటి సునీల్,తాటికొండ శ్రవణ్, తాటికొండ సాయి,గుండేటి రాజేష్,ఎం డి రియాజ్ పాషా,గుండేటి ప్రశాంత్,మహంకాళి మొగిలి,గుండేటి మొగిలి,నమ్మిండ్ల ఏలీయా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అడ్డగుట్ట డివిజన్ బుద్ధ నగర్ లో బస్తీ సమస్యలు, నీటి సమస్యలు పట్టించుకోని స్థానిక కార్పొరేటర్..

### సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆదం సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు..

### బస్తీలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్న అడ్డగుట్ట ఇంచార్జ్ ఆదం భరత్ కుమార్..



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్,( శుభోదయం న్యూస్): సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట డివిజన్ బుద్ధ నగర్ లో సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆదం సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు, అడ్డగుట్ట డివిజన్ ఇంచార్జి ఆదం భరత్ కుమార్ బస్తీ పర్యటన చేపట్టి,బస్తీ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక కార్పొరేటర్ బస్తీ సమస్యలు, నీటి సమస్యలు, బోర్లు, డ్రైనేజీ సమస్యలు పట్టించుకోవడంలేదని బస్తీ వాసులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. వెంటనే స్పందించి బస్తీలో పర్యటించి బస్తీ సమస్యలు అడిగి తెలుసుకున్నామన్నారు. ఈ యొక్క సమస్యలను సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్ శ్రవంతి సమక్షంలో మాట్లాడారు. ఎ ఇ వెంటనే స్పందించి నీటి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు, అలాగే డ్రైనేజీ పైప్ లైన్ లీకేజ్ సమస్యను కూడా పరిష్కరిస్తామని అన్నారు.ఈ యొక్క కార్యక్రమంలో అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షులు గణేష్ యాదవ్, సికింద్రాబాద్ డిసిసి కేకేసి చైర్మన్ గంట రాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రామిల్ల రాము,దొమ్మాటి శివకుమార్, అనిల్, హరి, జగదీష్, సేవాదళ్ రామలీల, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రొఫెసర్ కోదండరామ్ చిత్రపటానికి పాలాభిషేకం

## ఆర్ఎంపీల హామీలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తుంది

### కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దండగుల యాదగిరి



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్, ( శుభోదయం న్యూస్): ఆర్.ఎం.పి వైద్యులను అన్ని విధాలుగా ఆదుకుంటామని, కాంగ్రెస్ పార్టీ టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి దండుగుల యాదగిరి అన్నారు. ఈనెల 18న ఆర్.ఎం.పి వైద్యులు ఇంద్ర పార్క్ దగ్గర మహాధర్న కార్యక్రమని చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంమ్ సంపూర్ణంగా మద్దతు తెలిపినందుకు, వారికి ధన్యవాదాలు తెలుపుతూ, ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ హాస్మంత్ పెట్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దండుగుల యాదగిరి మాట్లాడుతూ... గత కొన్నేళ్ల నుండి ఆర్ఎంపీలు సామాన్య మధ్యతరగతి ప్రజలకు ప్రథమ చికిత్స చేస్తూ, ఎంతో సేవ చేస్తున్నారని, వారందరికీ ప్రభుత్వం శిక్షణ తరగతులు నిర్వహించి, సర్టిఫికెట్లు అందించి వారికి భద్రత కల్పిస్తామని టిపిసిసి మహేష్ కుమార్ గౌడ్ హామీ ఇచ్చారంటే కచ్చితంగా నెరవేరుతుందని తెలిపారు. డాక్టర్ రాజాగట్టు మాట్లాడుతూ... ప్రభుత్వం తమను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించినందుకు, మొదటి నుండి ఆర్ఎంపీలకు అండగా ఉన్న, ప్రొఫెసర్ కోదండరాం చిత్రపటానికి ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ ఆర్ఎంపి వైద్యుల కమిటీ నుండి పాలభిషేకం చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేక చొరవ తీసుకొని త్వరగా సర్టిఫికెట్లు తో పాటు, తమకు భద్రత కల్పించాలని కోరారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ఎన్.ఎస్.యు.వై వర్కింగ్ ప్రెసిడెంట్ అరుణ్ రెడ్డి మాట్లాడుతూ... వైయస్ రాజశేఖర్ రెడ్డి హాయంలో ఆర్ఎంపి వైద్యులకు అన్ని విధాల ప్రభుత్వం నుండి సహాయం చేస్తామని తెలిపారని మరోసారి గుర్తు చేశారు. ఆర్ఎంపి డాక్టర్లు చేసే సేవలను గుర్తించి, వారి డిమాండ్లను కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తుందని ఆశభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ చైర్మన్ శ్రీరాములు, ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ ఆర్ఎంపి వైద్యులు డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ భీమ్రావు, డాక్టర్ నాగేందర్, డాక్టర్ లతీఫ్, డా: రాజశేఖర్, డాక్టర్ రాజు, డా: కార్తీక్, డా: అరవిందస్వామి, డా: వెంకట్ స్వామి, వెంకటేష్, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శుభోదయం
ప్రతి అక్షరం..ప్రజా సమరం......!
WWW.SUBHODAYAMDAILY.COM



# బీర్కూర్ మండల ఇన్ హౌస్ ప్రజావేధిక



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): నేడు ఉపాధి హామీ పథకం లో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేసిన పనులకు సంబంధించి నిర్వహించిన సామాజిక తనిఖీ యొక్క ఇన్ హౌస్ ప్రజా వేదిక బీర్కూర్ రైతు వేదిక నందు నిర్వహించడం జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వున్నందు వలన ఇన్ హౌస్ ప్రజవేదిక నిర్వహించడం జరిగింది సామాజిక తనిఖీ బృందం వారు గ్రామాల వారీగా సమాచారం చదివి వినిపించడం అయినది. ప్రిసైడింగ్ అధికారి శ్రీ వామన్ రావు గారు వచ్చిన అభియోగల పై నిర్ణయాలు తీసుకోవడం జరిగింది ఇట్టి ప్రజావేదిక లోజిల్లా విజిలెన్స్ అధికారి ప్రశాంత్ కుమార్ గారు, ఎంపిడిఓ భాను ప్రకాష్ గారు, ఎంపీవో మహబూబ్ గారు, ఏ పి ఓ అక్మల్ గారు, యస్ ఆర్ పి మహేష్ గారు, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు ఉపాధి హామీ సిబ్బంది మరియు సామాజిక తనిఖీ బృందం వారు పాల్గొన్నారు

# జిఎంఆర్ ఫంక్షన్ హాల్ లో తాజా మాజీ పాలకవర్గాలను ఘనంగా సన్మానించిన జిఎంఆర్



పటాన్చెరు : (శుభోదయం న్యూస్)సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్ లో పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని తెల్లాపూర్, అమీన్పూర్, బొల్లారం మున్సిపాలిటీల తాజా మాజీ పాలకవర్గాలను ఘనంగా సన్మానించారుఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన



మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమమని, పదవులు అశాశ్వతమని అన్నారు. పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తే అవకాశాలు వాళ్లే కల్పిస్తారని తెలిపారు. ప్రజల చేత ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోబడటం ఒక అదృష్టమని వారు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నప్పుడే పరిపూర్ణత లభిస్తుందని అన్నారు. రాబోయే రోజుల్లోనూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. మున్సిపాలిటీల అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయం స్థిర ప్రతిష్టపన కార్యక్రమంలో పాల్గొన్న జిఎంఆర్



పటాన్చెరు : (శుభోదయం న్యూస్)సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ లో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయం స్థిర ప్రతిష్టాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి. అనంతరం వారిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో మాదిరి పృథ్వీరాజ్.



పటాన్చెరు : (శుభోదయం న్యూస్)పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఇస్నాపూర్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో కన్నులపండువగా నిర్వహించబడింది. ఈ మహోత్సవంలో బీఆర్ఎస్ యువ నాయకుడు మాదిరి పృథ్వీరాజ్ హాజరై అమ్మవారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో ఆలయాలు కీలక పాత్ర



పోషిస్తాయని పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు పృథ్వీరాజ్ గారిని శాలువతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# : బీర్కూర్ లో జోరుగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



బీర్కూర్, మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూర్ మండల కేంద్రం లో పట్టభద్రులు ఈనెల 27 వ తేదీన జరగనున్న ఎన్నికలలో తమ అమూల్యమైన ఓటును మన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీ నరేందర్ రెడ్డి గారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీర్కూర్ మండల కేంద్రం లో మాజీ ఎంపీపీ రఘు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమం లో అరిఫ్,రాజ్ పటేల్, గాండ్ల సంఘం అధ్యక్షులు సంతోష్, కోరిమే రఘు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ గుడికి ఎన్నారై విరాళం



వర్గల్ మండల్ రిపోర్టర్ విష్ణువర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్): వర్గల్ మండలం మైలారం గ్రామంలో ముదిరాజ్ సంఘం నిర్మిస్తున్న పెద్దమ్మ గుడి కి చాంద్ ఖాన్ మక్త గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మేదిని రామకృష్ణారెడ్డి కుమారుడు ఎన్నారై మేదిని జైపాల్ రెడ్డి విరాళంగా మూడు లక్షల రూపాయలు అందజేశారు. ఎన్నారై జైపాల్ రెడ్డి మాట్లాడుతూ పెద్దమ్మతల్లి ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. త్వరలోనే పెద్దమ్మ గుడి నిర్మించి గ్రామంలో పండగ జరుపుకోవాలని ముదిరాజ్ సంఘాన్ని కోరారు. ముదిరాజ్ సంఘం సభ్యులు జైపాల్ రెడ్డి విరాళం ఇవ్వడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# గ్రాడ్యుయేట్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో హాజరైన బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్న మైల్ అంజిరెడ్డి



పటాన్చెరు : (శుభోదయం న్యూస్)గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన నిజామాబాద్,మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి వర్యులు బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సంజీవ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే రామక్రిష్ణ రెడ్డి, పార్టీ జిల్లా పదాదికారులు, మండల అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు.

# నల్ల పోచమ్మ పండగ సందర్భంగా చిమ్ముల గోవర్ధన్ రెడ్డిని ఆహ్వానించడం జరిగింది



గుమ్మడిదల : (శుభోదయం న్యూస్) గుమ్మడిదల మండలం కానుకుంట రెడ్డి సంఘం తరపున నూతన అధ్యక్షుడు జంగాల నరసింహారెడ్డి మరియు ఉపాధ్యక్షులు గజ్జల మాధవరెడ్డి సలహాదారు జంగాల అనిల్ రెడ్డి కోశాధికారి జంగాల రాజిరెడ్డి మరియు కమిటీ మెంబర్స్ పద్మా రెడ్డి సత్తిరెడ్డి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలో మార్చి 6 తారీఖున నల్ల పోచమ్మ పండగ చేస్తున్న సందర్భంగా చిమ్ముల గోవర్ధన్ రెడ్డి గారిని ఆహ్వానించడం జరిగింది.

# నల్లవల్లి ప్యారా నగర్ డంపు యార్డ్ సర్వే పనులను సర్వే డిపార్ట్మెంట్ అధికారులు సర్వే నిర్వహించారు



గుమ్మడిదల : (శుభోదయం న్యూస్)గుమ్మడిదల మండలం నల్లవల్లి ప్యారా నగర్ డంప్ యార్డ్ సర్వే పనులను రైతులతో కలిసి సందర్శించిన గుమ్మడిదల మండల రైతు సంఘం జేఏసీ నాయకులు మద్దుల బాల్ రెడ్డి మరియు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి మంద చంద్రా రెడ్డి పోచుగారి శ్రావణ్ రెడ్డి రైతులతో కలిసి సర్వేలో



పాల్గొనడానికి వెళ్లిన తర్వాత రైతులు అందరూ వ్యతిరేకించడం జరిగింది వచ్చిన అధికారులు సర్వే డిపార్ట్మెంట్ వాళ్లు రాంకీ సంస్థకు అనుకూలంగా సర్వే నిర్వహించడానికి ప్రయత్నాలు చేశారు. ఈ ప్రయత్నాన్ని రైతులందరూ తీవ్రంగా వ్యతిరేకించారు దీంతో సర్వే పనులు నిలిచిపోయాయి.

# అభివృద్ధి పనులు పూర్తి చేసినందుకు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కు తెలిపిన ధన్యవాదాలు

**45వ డివిజన్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మాజీ కార్పొరేటర్ దాసరి ఉమాదేవి సాంబమూర్తి**




రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్) రామగుండం శాసన సభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ గెలిచిన సంవత్సరం కాలములో స్థానిక 26వ డివిజన్ లోని లక్ష్మి గణపతి నగర్ లో సుమారు 2 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేసినందుకు కృతజ్ఞతగా థాంక్స్ రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ అని వినూత్న కార్యక్రమం పూర్వ 45వ డివిజన్ కార్పొరేటర్, డివిజన్ ఇంచార్జ్,జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దాసరి ఉమాదేవి సాంబమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించినారు..దాసరి సా%శీ%బమూర్తి మాట్లాడుతూ గెలిచిన మొదటి సంవత్సరంలోనే ఇచ్చిన మాటను నెరవేర్చుతూ కాలనీ లోని 70% అభివృద్ధి పనులు పూర్తి చేయించడం జరిగింది. అందుకు ధన్యవాదాలు తెలుపుతూ థాంక్స్ రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దేశంలో 1రైసింగ్ తెలంగాణ అయితే రాష్టం లో 1రైసింగ్ రామగుండం అవుతుంది, కానీ కళ్ళు ఉండి కనపడని విమర్శ కాబోధులకు ఈ అభివృద్ధి ఎందుకు కనపడుట లేదని విమర్శిస్తూ అభివృద్ధికి అంబాసిడర్- రామగుండం పునర్నిర్మాణ అభివృద్ధి ప్రధాత రాజ్ ఠాగూర్ మక్కాన్ సింగ్ అని చెప్పినారు..ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గుంపుల తిరుపతి, కాలనీ అధ్యక్షులు గోలి సతీష్, ప్రధాన కార్యదర్శి రంగు శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లంబు సత్య నారాయణ రెడ్డి, చింతల రాజిరెడ్డి, మరియు రఘుపతి, లక్ష్మణ్, సాంబమూర్తి, ఐలయ్య, రమేష్, వెంకటేశ్వర్లు, నాగేశ్వర్రావు, సాగర్, సమ్మయ్య గౌడ్, ప్రశాంతి, లక్ష్మి, పుష్ప, చిత్రసుధా, విజయలష్మి, నిర్మలలహరిక, వేదలక్ష్మి, శ్రావణి, పాతపెల్లి రవి,పడాలశంకర్, పాతపెల్లి రాయమల్లు,తోకల మధుసూదనరెడ్డి, కైలాసం, కొమురయ్య, జనార్ధన్ , శ్రీధర్, రజినీకాంత్, రాజయ్య, అధిక సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

# : ఘనంగా గురుకుల పాఠశాల వార్షికోత్సవాలు




బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): కామారెడ్డి జిల్లా బీర్కూరు మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల బాలుర లో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల విద్యార్థుల సంస్కృత నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమం లో నోడల్ అధికారి షేక్ సలాం మాట్లాడుతూ రాబోయే పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ పరీక్షలు వస్తున్నందున విద్యార్థులు కష్టం తో కాకుండా ఇష్టంతో చదివి మీ తల్లిదండ్రులకు విద్యార్థులకు సమాజానికి మంచిపేరు వచ్చేలా అత్యున్నతమైన మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. రాష్ట్రం పేద బడుగు బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులకు చదువు దూరం కాకూడదనే ఉద్దేశం తో గురుకుల పాఠశాలలు స్థాపించి నాణ్యమైన విద్యను మంచి ఆహారాన్ని అందిస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమార్, మండల విద్యాధికారి వెంకన్న, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ విద్యా విధానాన్ని ఆమోదించేది లేదు



చెన్నై : జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) -2020 మరియు త్రిభాషా విధానాన్ని డిఎంకె ఎప్పటికీ ఆమోదించదని తమిళనాడు డిప్యూటీ సిఎం స్టాలిన్ పునరుద్ఘాటించారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యలపై శుక్రవారం ఆయన పై విధంగా స్పందించారు. తమ రాష్ట్ర ఆర్థిక హక్కుల కోసం పోరాడుతున్నామని, తమళనాడు విద్యార్థుల కోసం నిధులను కోరుతున్నామని అన్నారు. ఇన్నేళ్లుగా రూ.2,150 కోట్ల నిధులను ఇస్తున్నామని, ఇప్పుడు ఎన్ఎపి, త్రిభాషా విధానాన్ని ఆమోదించాలని కేంద్రం ఒత్తిడి తీసుకువస్తోందని అన్నారు. త్రిభాషా విధానానికి తాము పూర్తి వ్యతిరేకమని, ఎప్పటికీ ఆమోదించమని స్పష్టం చేశారు. తమిళనాడు వంటి రాష్ట్రంలో భాష కోసం ప్రజలు ప్రాణాలు అర్పించారని అన్నారు. ఈ అంశంపై ఎవరు రాజకీయాలు చేస్తున్నారో ప్రజలకు తెలుసునని విమర్శించారు. తమ రాష్ట్రానికి 'సమగ్ర శిక్ష' పథకం కింద నిధులను విడుదల చేయాలంటూ తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రధాని మోడీకి లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఎన్ఇపి 2020లో పేర్కొన్న త్రిభాషా విధానాన్ని అమలు చేసేంతవరకు రాష్ట్రానికి నిధులు విడుదల చేయబోమని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన ప్రకటనపై ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు స్టాలిన్ ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖపై ధర్మేంద్ర ప్రధాన్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఎన్ఇపి-2020 రాష్ట్రంపై ఏ భాషనూ విధించడం లేదని అన్నారు. వచ్చే ఏడాది తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో రాజకీయ ప్రయోజనాల కోసం బిజెపి ఈ వైఖరి తీసుకుందని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## మిర్చి రైతుల సమస్యలపై కేంద్రం కీలక భేటీ



న్యూఢిల్లీ : మిర్చి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించి కేంద్ర వ్యవసాయ శాఖ శుక్రవారం కీలక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఢిల్లీలోని కృషి భవన్‌లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలో ఈ భేటీ కొనసాగుతోంది. మిర్చి రైతులకు మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం ద్వారా మద్దతు ధర కల్పించే విషయంపై సమావేశంలో చర్చిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత పరిస్థితులు, రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలు, ఏపీ నుంచి మిర్చి ఎగుమతికి ఉన్న మార్గాలపై భేటీలో చర్చ కొనసాగుతోంది. అయితే ఏపీ రైతులతోపాటు తెలంగాణ రైతుల మిర్చిని కూడా కేంద్రం కొనుగోలు చేస్తుందా.. లేదా అనే దానిపై స్పష్టత లేదు. ఈ భేటీలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ పేరుతో 50కోట్ల దోపిడీకి? కాంగ్రెస్ ప్లాన్



పెద్దపల్లి: తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామని డబ్బులు వసూలు చేస్తారా? అని ప్రశ్నించారు. ఇదే సమయంలో కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే కేంద్ర బడ్జెట్‌పై చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్రమంత్రి బండి సంజయ్ నేడు పెద్దపల్లి జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఎల్ఆర్ఎస్ పేరుతో రూ.50వేల కోట్ల దోపిడీకి కాంగ్రెస్ ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామని ఇప్పుడు డబ్బులు వసూలు చేస్తారా?. ఎన్నికల సమయంలో మీరు ఇచ్చిన హామీ ఇదే(ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామని కాంగ్రెస్ నేతలు మాట్లాడిన వీడియో). ఇప్పుడు ఎందుకు మాట మార్చుతున్నారు?. కాంగ్రెస్ పార్టీ బర్త్, డెత్ రెగ్యులరైజేషన్ స్కీంలను కూడా ప్రవేశపెడతారేమో అంటూ ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో కేంద్ర బడ్జెట్‌పై ద?మ్ముంటే బహిరంగ చర్చకు రండి. మీకు చేతనైతే బీసీ రిజర్వేషన్లపై టెన్ జనపథ్ ఎదుట ధర్నా చేయండి. కాంగ్రెస్ నమ్మక ద్రోహానికి, బీజేపీ పోరాటాలకు మధ్య జరుగుతున్న ఎన్నికలు ఇవి. ఈ ఎన్నికల్లో కచ్చితంగా బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఇదిలా ఉండగా.. ఈ నెల 27న మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్- కరీంనగర్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలతోపాటు వరంగల్- ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి.

## తప్పుడు కేసుపై డీజీపీకి పేర్ని నాని ఫిర్యాదు



గుంటూరు,: తనపై తప్పుడు కేసు నమోదు అయిన విషయాన్ని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) డీజీపీకి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు శుక్రవారం ఫిర్యాదు చేస్తూ డీజీపీ హరీష్ కుమార్ గుప్తాకు ఓ లేఖ రాశారు. గిట్టుబాటు ధర లేక ఆందోళనలో ఉన్న గుంటూరు మిర్చి రైతులను బుధవారం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరామర్శించిన సంగతి తెలిసిందే. ఆయన జగన్, మరికొందరు వైఎస్సార్‌సీపీ నేతలు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారంటూ నల్లపాడు పీఎస్‌లో టీడీపీ నేతలు కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో జగన్ సహా వైఎస్సార్‌సీపీ నేతలపై కేసు నమోదు అయ్యింది. అయితే ఆ పర్యటనలో పాల్గొనని పేర్ని నాని పై కూడా కేసు నమోదు కావడంతో ఆయన స్పందించారు. ఈ పర్యటనలో పాల్గొనకున్నా తన ప్రతిష్టను దెబ్బ తీసేందుకు తనపై ఫిర్యాదు చేశారని డీజీపీకి రాసిన లేఖలో పేర్కొన్నారాయన. ప్రజాక్షేత్రంలో ఉన్న తనపై ఇలాంటి తప్పుడు కేసు బనాయించడం.. అందరినీ తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని అన్నారాయన. ఈ అంశంపై విచారణ జరిపి తప్పుడు ఫిర్యాదు చేసిన వాళ్లపై, అలాగే బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారాయన.

# ఉదారతకు ట్రంప్ వీడ్కోలు!



రెండోసారి అమెరికా అధ్యక్ష పీఠం ఎక్కింది మొదలు వ్యవస్థల్ని ఎడాపెడా తొక్కుకుంటూ పోతున్న డోనాల్డ్ ట్రంప్ దృష్టి ప్రపంచ దేశాలకు ఉదారంగా సాయం అందించే అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ (యూఎస్ ఎయిడ్)పై పడింది. గత నెల 27నే ఆ సంస్థ కార్యకలాపాలను నిలిపేస్తూ ఆయన ఉత్తర్వులిచ్చారు. దాన్నుంచి విడుదలయ్యే నిధుల గురించి సమీక్షించి ఆ పంపిణీని 'మరింత సమర్థంగా', తమ విదేశాంగ విధానానికి అనుగుణంగా వుండేలా రూపుదిద్దుతామని ఆ సందర్భంగా ప్రకటించారు. ఇప్పుడు దాని తాలూకు సెగలూ పొగలూ మన దేశాన్ని కూడా తాకాయి. ఆ సంస్థ నుంచి లబ్ధి పొందింది 'మీరంటే మీర'ని బీజేపీ, కాంగ్రెస్‌లు వాదులాడుకుంటున్నాయి. సామాజిక మాధ్యమాల్లో గాలించి గత చరిత్ర తవ్వి పరస్పరం దుమ్మెత్తి పోసుకుంటున్నాయి. వెనకా ముందూ చూడకుండా చొరవగా దూసుకెళ్లే బీజేపీయే ఈ వాగ్యుద్ధానికి అంకురార్పణ చేసింది. కాంగ్రెస్, మరికొన్ని పౌర సమాజ సంస్థలూ యూఎస్ ఎయిడ్ నుంచి దండిగా నిధులు పొందాయన్నది బీజేపీ ఆరోపణల సారాంశం. పనిలో పనిగా ప్రపంచ కుబేరుడు జార్జి సోరోస్‌తో కాంగ్రెస్‌కున్న సంబంధాలు మరోసారి ప్రస్తావనకొచ్చాయి. జార్జి సోరోస్‌కు చెందిన ఓపెన్ సొసైటీ ఫౌండేషన్ నుంచి యూఎస్ ఎయిడ్‌కు ప్రధానంగా నిధులు వస్తాయి గనుక దాన్నుంచి నిధులందుకున్నవారంతా మచ్చపడినవారేనని బీజేపీ అభియోగం. కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ మరో అడుగు ముందుకేసి యూఎస్ ఎయిడ్ నిధులతోనే ప్రభుత్వంపై అసంతృప్తిని పెంచే నిరసనోద్యమాలు దేశంలో గత కొన్నేళ్లుగా నడుస్తున్నాయని తేల్చారు. దేశద్రోహులు అనే మాటైతే వాడలేదుగానీ... ఆ చట్రంలో ఇమిడే కార్యకలాపాలన్నిటినీ పరోక్షంగా కాంగ్రెస్‌కూ, ఇతర సంస్థలకూ అంటగడుతూ ఏకరువు పెట్టారు. అటు కాంగ్రెస్ ఊరుకోలేదు. కేంద్రమంత్రి స్మృతీ ఇరానీ ఒకప్పుడు యూఎస్ ఎయిడ్ రాయబారిగా పనిచేయటం, నీతి ఆయోగ్, స్వచ్ఛభారత్ వంటి సంస్థలకు నిధులు రావటం వగైరాలను ప్రస్తావించింది. వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యా లయం వెబ్‌సైట్ సమాచారం ప్రకారం యూఎస్ ఎయిడ్ మన ప్రాథమిక విద్య, ఉపాధ్యాయ శిక్షణ, వ్యవసాయం, తాగునీరు, ఇంధనం వగైరాలకు సాయపడుతున్నది. ఇదంతా చూస్తుంటే 'గొంగట్లో తింటూ వెంట్రుకలు ఏర దం' నానుడి గుర్తుకొస్తుంది. 1961లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడీ ఏలుబడిలో ప్రారంభమైన ఈ సంస్థనుంచి నిధులందుకున్న పార్టీలూ, స్వచ్ఛంద సంస్థలూ కొల్లలుగా ఉన్నాయని భావించవచ్చు. ప్రభుత్వ కార్యక్రమా లకు కూడా అది సాయపడింది. అమెరికా తన బడ్జెట్‌లో ఒక శాతాన్ని అంతర్జాతీయ సాయానికి కేటాయిస్తున్నది. ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం ప్రపంచంలో అత్యధిక మానవతా సాయాన్ని అందించే ఏకైక దేశం అమెరికాయే. అంతర్జాతీయంగా నిరుడు వివిధ దేశాలకు అందిన సాయంలో అమెరికా వాటా 40 శాతం. 2025 ఆర్థిక సంవత్సరానికి యూఎస్ ఎయిడ్ ద్వారా 5,840 కోట్ల డాలర్లు వ్యయం కావొచ్చన్న అంచనా ఉంది. ట్రంప్ ప్రస్తుతం దాన్ని నిలుపుదల చేశారు గనుక ఇందులో ఎంత మొత్తానికి కత్తెరపడుతుందో అంచనా వేయటం కష్టం. మనకైతే ఇకపై రాక పోవచ్చు. ఎందుకంటే ట్రంప్ ఉద్దేశంలో భారత్ సంపన్న దేశం. 2021 నుంచి నిరుడు డిసెంబర్ వరకూ మన దేశానికి 2 కోట్ల డాలర్లు కేటాయించగా అందులో కోటీ 25 లక్షల డాలర్లు అందించినట్టు లెక్కలున్నాయి. ఇదంతా 'ప్రజాతంత్ర భాగస్వామ్యం', పౌర సమాజం కోసం అని యూఎస్ ఎయిడ్ అంటున్నది. ఇందులో 55 లక్షల డాలర్లు నిరుడు జరిగిన ఎన్నికల్లో పెద్దయెత్తున వోటర్లు పాల్గొనేలా చూడటానికి అందించారు. ఏ సంస్థ ఎంత పొందిందన్న వివరాలు మాత్రం లేవు. దక్షిణ అమెరికాలో అమెజాన్ అడవుల రక్షణ, ఆఫ్రికాలో వ్యాధులు అరికట్టడానికి, ఆడపిల్లల విద్యకు, ఉచిత మధ్యాహ్న భోజనానికి సాయం చేయగా... రష్యా ఇరుగు పొరుగు దేశాల్లో దాని ప్రభావం తగ్గించటానికి, యుద్ధక్షేత్రమైన సిరియాలో ఆస్పత్రుల కోసం, ఉగాండాలో అట్టడుగు తెగల అభ్యున్నతికి, కంబోడియాలో మందుపాతరల తొలగింపునకు, బంగ్లాలో పౌరసమాజం కోసం... ఇలా భిన్నమైన పథకాలకూ, కార్యక్రమాలకూ అమెరికా తోడ్పడుతోంది. అసలు ఎవరైనా ఎందుకు సాయం చేస్తారు? వ్యక్తుల వరకూ చూస్తే తమ ఎదుగుదలకు కారణమైన సమాజానికి తిరిగి ఏదో ఇవ్వాలన్న కృతజ్ఞతా భావన కారణం కావొచ్చు. కానీ ఏ ఉద్దేశమూ లేకుండా అయా చితంగా ఖండాంతరాల్లోని సంపన్న దేశాలు వేరే దేశాలకు ఎందుకు తోడ్పాటునిస్తున్నాయి? చరిత్ర తిరగేస్తే దీని వెనకున్న మతలబు అర్థమవుతుంది. అప్పట్లో సోవియెట్ యూనియన్ ప్రభావం నుంచి ప్రపంచాన్ని 'రక్షించే' బాధ్యత తన భుజస్కంధాలపై వేసుకుని అమెరికా ఈ సాయం మొద లెట్టింది. అటు సోవియెట్ సైతం ఆ పనే చేసేది. ప్రపంచం దాదాపు రెండు శిబిరాలుగా చీలిన ఆ కాలంలో అమెరికా, సోవియెట్‌లకు ఈ ఉదారత ఎందుకంటిందో సులభంగానే గ్రహించవచ్చు. సాధారణ ప్రజానీకంలో తమపట్ల అనుకూల భావన కలిగితే అవతలివారిని సగం జయించినట్టేనని ఆ రెండు దేశాలూ భావించేవి. ప్రపంచ దేశాలన్నీ ప్రత్యర్థులుగా కనబడుతున్న వర్తమానంలో అమెరికాకు ఉదారత అవసరం ఏముంది? 'నేను ఆదేశించింది పాటించటమే తప్ప నాతో తర్కానికి దిగొద్ద'ని ట్రంప్ స్వయంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మనదేశం ఈ సాయాన్ని ముందే తిరస్కరించి ఉంటే ఎంతో హుందాగా ఉండేది. కానీ ఇవ్వబోమని అమర్యాదకరంగా చెప్పించుకోవటం ఆత్మాభిమానం గల భారతీయులందరికీ చివుక్కుమనిపించే సంగతి. పాలకులు గ్రహిస్తారా?

# ఉపాధికి ఊతమివ్వని ఉత్పాదక రంగం



భారత దేశంలో 50% మంది స్వయం ఉపాధి రంగంలో ఉపాధి పొందుతున్నారు. ఇది ప్రపంచంలోనే అత్యధికమని ఐఎస్ఒ నివేదించింది. ఒకరి మీద ఆధారపడకుండా స్వయం ఉపాధి చూసుకోవాలని మన నేతలు నిత్యం చేసే ప్రచారాన్ని చూసి ఇది మంచిదే అని అనుకోడానికి లేదు. ఎందుకంటే భారతదేశంలో ముఖ్యంగా స్వయం ఉపాధి రంగం దారుణంగా ఉంది. స్వయం ఉపాధి రంగంలో స్థిరపడాలనుకునే వారికి సపోర్ట్ ఉండదు. ఉద్యమిమిత్ర, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, గోపాలమిత్ర, నేషనల్ లైవ్ స్టాక్ మిషన్, ప్రధాన మంత్రి సంచాయిని యోజన అన్నీ దండగమారి పథకాలే. 2022 లెక్కల ప్రకారం ఉద్యోగం పొందిన భారతీయుడు సగటున నెలకు 19,000 రూపాయల వేతనం పొందుతుంటే, స్వయం ఉపాధి రంగంలో సగటు భారతీయుడు రూ.11,973 మాత్రమే ఆదాయం పొందుతున్నారు.క్యాజువల్ కార్మికులు సగటున నెలకు కేవలం రూ.8,267 మాత్రమే వేతనం పొందుతున్నాడు. ఇందులో కూడా స్త్రీ పురుషుల మధ్య తీవ్రమైన వ్యత్యాసం ఉంటుంది. ముఖ్యంగా స్వయం ఉపాధి రంగంలో స్త్రీలు ఆదాయం మరీ తక్కువగా వస్తుంది. వాస్తవానికి వారి కష్టాన్ని లెక్కించడం లేదు. భారతదేశంలో యువత ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొనే రేటు అంటే శ్రామికశక్తి భాగస్వామ్య రేటు(లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేటు) కూడా గణనీయంగా తగ్గిపోతుంది. 2000 సంవత్సరంలో ఈ రేటు 54% ఉండగా, 2022 నాటికి 42 శాతానికి పడిపోయింది. శ్రామికశక్తి భాగస్వామ్య రేటు అంటే ఆర్థిక వ్యవస్థలో పనిచేస్తున్న 16-64 సంవత్సరాల వయస్సు గల శ్రామిక జనాభాలో ఉపాధి కోరుకునే వారి జనాభా శాతం. ఇది ఒక కీలకమైన ఆర్థిక సూచిక. గత రెండు దశాబ్దాలుగా ఇది గణనీయంగా పడిపోయింది. జనాభాలో కార్మికుల సంఖ్య కూడా 2000 సంవత్సరంలో 60.2 శాతం నుంచి 2022 నాటికి 52.9 శాతానికి పడిపోయింది. కార్మిక భాగస్వామ్య రేటు కూడా పురుషుల కన్నా మహిళల్లో ఎక్కువపడిపోయింది. 2000 %- % 2022 మధ్య పురుషుల్లో ఇది 8.1% పడిపోగా, మహిళల్లో 14.4 శాతం పడిపోయింది. 20002019 సంవత్సరాల మధ్య మొత్తం ఉద్యోగాల్లో నైపుణ్యాలు గల ఉద్యోగాలు పెరుగుతూ వచ్చాయి. మరోవైపు చిన్నతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం కరువయ్యింది. బ్యాంకుల నుండి అరువు పుట్టాలంటే డిటైల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ఉండాలి, సిబిల్ రేటింగ్ ఉండాలి, బ్యాంక్ అధికారులతో సత్సంబంధాలు ఉండాలి, లిక్విడ్ షూరిటీ ఉండాలి. దాదాపు ఎనభై శాతం దరఖాస్తులు తిరస్కరించపడుతున్నాయి. ప్రజాధనంతో లావాదేవీలు జరిపే ఈ బ్యాంకులు బడా పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులతో బంధం ఉన్న వారికి లక్షల కోట్ల రూపాయలు మాఫీ చేస్తున్నారు. వాటిని వసూళ్లు చేయలేక, కనీసం వారిని ప్రశ్నించడం కూడా చేతకాక ప్రజాధనాన్ని ప్రభుత్వం మాఫీ చేస్తున్నారు. సామాన్యుల విషయంలో బ్యాంకులు ప్రవర్తించే తీరు దారుణంగా ఉంటుంది. రైతులు, కిరాణా వ్యాపారస్తులు, చిన్న పారిశ్రామికవేత్తలు తాము చెల్లించాల్సిన వాయిదా సక్రమంగా లేకపోతే విరుచుకుపడే బ్యాంకులు బడాబాబుల పారు బకాయిల విషయంలో ఎందుకు నోరు మెదపలేదు. ప్రతి రోజూ కనీసం పది నుంచి ఇరవై వరకు చిన్న, మధ్య తరహా పరిశ్రమలను మూసివేస్తున్నట్టు లేదా వేలం వేస్తున్న ప్రకటనలు హిందూ పత్రికలో కనిపిస్తాయి. ఒక్క హిందూ దినపత్రిక దక్షిణ భారత ఎడిషన్‌లో నెలకు వెయ్యికి పైగా పరిశ్రమలకు ఉరితాడు వేస్తున్నట్టు బ్యాంకుల ప్రకటనలు కనిపిస్తాయి. మొత్తం ఆంగ్ల పత్రికల్లో ప్రకటనలు లెక్కిస్తే ఈ సంఖ్య 2000 కి తక్కువేమీ కాదు. కానీ నరేంద్ర మోడీ ప్రభుత్వం సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమల తాము అందిస్తున్న సహకారం చాలా ఉందని, బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్, అనుపమ్ ఖేర్ ఫోటోతో పూర్తి పేజీ ప్రకటనలతో అప్పుడప్పుడు దేశంలోని అన్ని భాషలలో గొప్పగా చెబుతుంటుంది. సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు గొప్ప అవకాశం అంబుడ్స్‌మెన్ ఈ తరహా విధానమని, తక్షణ పరిష్కారానికి వినియోగించుకోవాలని రిజర్వు బ్యాంకు తరఫున ప్రకటనలలో సారాంశంగా ఉంటుంది. పై ప్రకటనలలో వాగాడంబరం తప్ప చిన్న పరిశ్రమలు నెలకొల్పే వారికి ప్రోత్సాహకాలు ఏమీ లేవని తేలుతున్నది. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక ఓ లెక్క ప్రకారం 60 లక్షల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతకు గురైనట్టు సమాచారం. పెద్ద నోట్ల రద్దు, కోవిడ్ కారణంగా ఈ సంఖ్య తీవ్రంగా పెరిగింది. కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా వీరికి ఒరిగింది ఏమీ లేదు. స్వయంకృషితో పది మందికి ఉపాధి కల్పించేందుకు ముందుకు వచ్చి పరిశ్రమలు స్థాపిస్తున్న వారికి ప్రోత్సాహం కరువవుతున్నది.

# షేర్ ట్రేడర్ల ఎదురీత



నేటి యువత షేర్ మార్కెట్‌లో చేస్తున్న తప్పిదాలు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. ఎందుకంటే అవగాహ న, ఆలోచనలు లేక విషయంపై పట్టు సంపూర్ణంగా లేకపోవడం ఆపై చేతులు కాల్చుకోవడం జరుగు తుంది. అనేక విభాగాల్లో యువ పెట్టుబడిదారులు షేర్ మార్కెట్లో స్థిరత్వం కోల్పోవడం జరుగుతుంది. షేర్ మార్కెట్‌పై కనీస అవగాహన లేకపోవడం అందుకు ప్రధాన కారణం. ప్రపంచమే ఒక కుగ్రామంగా మారిందనే భావనతో నేటి కాలంలో ప్రతి వ్యక్తి ఊహ నిజమే అని చెప్పవచ్చు. ఎందుకంటే విస్తృత ప్రపంచంలో అనేక విషయాలపై ఒక వ్యక్తి సమగ్రమైనటువంటి విషయాన్ని గ్రహించే అవకాశాలు అనేకంగా ఉన్నాయి. ఏ మార్గం అయితే తనను ఒక ఉన్నత మార్గంలో ప్రయాణింప చేస్తుందో అనేది మాత్రం తన సొంత నిర్ణయంగా మారుతుంది. నిత్య అన్వేషిగా అనేకమైన విషయాలపై వ్యక్తి తన నూతన ఆవిష్కరణకు చేరువ కావాలని ప్రయత్నం జరుగుతుంది. ఆ దిశగా యువత అనేక రకాలుగా ప్రయత్నం చేస్తుంది. ఏదైన ఒక దేశ సంపద ఒక కోణంలో పరిశీలిస్తే అది యువత మేధస్సే ప్రధానం అని చెప్పవచ్చు. మరి కొందరు యువత ఏ మార్గంలో ప్రయాణిస్తుందో ఒక్కసారి తెలుసుకుందాం. ఆశ ఆశ ఆశ కష్టించి పని చేయడం ద్వారానే ఒక నిర్మాణాత్మకమైన స్థానాన్ని సాధించుకోవడానికి అవకాశం భవిష్యత్‌లో ఎక్కువగా ఉంటుంది. కానీ ఆ విషయాన్ని గ్రహించక కొందరు యువత షేర్ మార్కెట్‌లో వివిధ రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆచరిస్తున్న విధానం ఒక కోణంలో చూస్తే తాత్కాలిక ఆలోచనలు, పోటీ ప్రపంచంలో వారిని నిత్యం వెంటాడుతున్న అనేక సంఘటనలు నిజాన్ని తెలుసుకోలేనటువంటి సందర్భాలు అనేకంగా ఉన్నాయి. ఏదైనా ఒక వస్తువు మూలం, దాని గత, భవిష్యత్తు పరిణామక్రమంపై అవగాహన సరిగా లేని కారణంగా అనేకమంది ఒక సందిగ్ధంలో కొట్టుమిట్టాడడం ఒక కారణం. దానికి తోడు ఆకర్షణీయమైన ప్రచార ప్రకటనలు, సామాజిక మాధ్యమాలు అందిస్తున్న విస్తృతమైన పోస్టింగుల ప్రభావం ప్రధానంగా ఉన్నది. అవును, నేటి యువత అనేక మంది షేర్ మార్కెట్‌లో చేస్తున్న తప్పిదాలు వారి భవిష్యత్ మార్గాలను ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. ఎందుకంటే అవగాహన, ఆలోచనలు లేక విషయంపై పట్టు సంపూర్ణంగా లేకపోవడం ఆపై చేతులు కాల్చుకోవడం జరుగుతుంది. అనేక విభాగాల్లో యువ పెట్టుబడిదారులు షేర్ మార్కెట్లో స్థిరత్వం కోల్పోవడం జరుగుతుంది. షేర్ మార్కెట్‌పై కనీస అవగాహన లేకపోవడం అందుకు ప్రధాన కారణం. ప్రపంచంలో పెట్టుబడి ప్రధాన మార్గాలను ఒక్కసారి పరిశీలిస్తే భూములు (రియల్ ఎస్టేట్), వ్యాపారం ఒక భాగం అయితే తమ పెట్టుబడితో సంపదను పెంచుకునే మరో మార్గం షేర్ మార్కెట్. ఉత్సాహవంతంగా యువత చేస్తున్న షేర్ మార్కెట్ వ్యాపారంలో వారు ప్రవేశించిన సమయంలో బుల్ మార్కెట్ ప్రభావంతో మరిన్ని అడుగులు ముందుకు వేస్తారు. ఆ సమయం మరింత ఉత్సాహంతో ముందుకు నడిపిస్తుంది. కానీ కష్టతరమైన కనిష్ట స్థాయిలో మార్కెట్ అనుకూల ప్రతికూల వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనే శక్తి లేకపోవడం ప్రధాన కారణంగా మారింది. మార్కెట్లో అప్ ట్రెండ్ ఏ విధంగా ఉంటుందో.. డౌన్ ట్రెండ్ కూడా ఉంటుందని విస్మరించడం గమనార్హం. సొంత వ్యాపారంలో గాని తెలిసిన వారికి డబ్బుని రుణంగా ఇచ్చే సమయంలో ఏ విధంగా ఆలోచిస్తారో ఆ విధంగా ఆలోచించకపోవడం జరుగుతుంది. ఫ్యూచర్స్‌లో అధిక మొత్తాల పెట్టుబడుల షేర్లను తక్కువ మొత్తానికి ఇన్వెస్టర్లకు అందించే వెసులుబాటు మార్గాలను కల్పిస్తున్నవి. ఇవి డబ్బులు సంపాదించడానికి కాకుండా డబ్బులు కాపాడుకోవడానికి ఉన్న అవకాశాలను వినియోగించుకునే విధానంపై ఆధారపడి ఉంటుంది. ఈక్విటీ షేర్‌లలో పెట్టిన పెట్టుబడి లో వచ్చే నష్టాలను అధిగమించడానికి వినియోగించుకునే మార్గంలో ఆప్షన్స్‌లో ఉన్న పెట్టుబడి అమ్మకాల ద్వారా సదరు పెట్టుబడిదారుడు స్థిరత్వాన్ని సంపాదించుకోవచ్చు. ఇది మార్కెట్‌పై అవగాహన ఉన్నప్పుడే జరుగుతుంది. కంపెనీల పెట్టుబడులను షేర్ మార్కెట్లో నడవడికను గమనించాలి. ఒక సంవత్సరంలో కనిష్ట, గరిష్ట హెచ్చుతగ్గులను అవి తాత్కాలికమా..! లేక స్థిరత్వంతో మనుగడ కొనసాగుతున్నాయా..! అనే వాటిపై వివిధ కోణాలలో పరిశీలించాలి. మార్కెట్ క్యాపిటలైజేషన్, పి ఇ రేషియో, ఇపిఎస్, ఆర్ఎస్ఐ ఇకపోతే ఐదు సంవత్సరాల డేటాతో పాటుగా కంపెనీ ఆస్తులు అప్పులు, లాభనష్టాల పట్టికలను గమనించాలి. ఏదేని ఒక కంపెనీ డివిడెండ్ ఇస్తుంది అంటే అది కంపెనీ లాభాలలో నుంచి వచ్చిన ప్రధాన మొత్తంగా భావించాలి. అలాంటి కంపెనీల షేర్లు కొన్ని మార్కెట్ ప్రభావాల పరిస్థితుల సందర్భంలో కనిష్ట స్థాయిలో ఉన్నప్పుడు ఆ షేర్లు కొనుక్కున్న పెట్టుబడిదారులు కొంతవరకు లాభసాటి మార్గంలో వెళుతున్నారని చెప్పవచ్చు. ఏదిఏమైనప్పటికీ షేర్ మార్కెట్‌పై ఒక నిర్మాణాత్మకమైనటువంటి అవగాహన ఉన్నప్పుడు, మార్కెట్‌ను ఇప్పటికప్పుడు పరిశీలిస్తూ మార్కెట్ హెచ్చుతగ్గులను చాకచక్యంగా అధిగమిస్తూ, ఒక కోణంలో దీర్ఘకాలికంగా పెట్టుబడులను కేంద్రీకరిస్తూ ముందుకు సాగినప్పుడే అనుకున్న ఫలితాలు సాధిస్తారు.

# మాకు ఉపన్యాసం ఇవ్వకండి



న్యూఢిల్లీ : ఢిల్లీలో కొత్తగా ఏర్పడిన బిజెపి ప్రభుత్వం తొలి మంత్రివర్గ సమావేశంలో మహిళలకు నెల నెలా రూ. 2500 భృతి పథకాన్ని ఆమోదిస్తామన్న ఎన్నికల ముందరి వాగ్దానాన్ని నెరవేర్చలేదని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ నాయకురాలు ఆతిశీ విమర్శించారు. బిజెపి 'ఢిల్లీ మహిళలను మోసగించింది' అని ఆతిశీ ఆరోపించారు. దీనిపై ముఖ్యమంత్రి రేఖా గుప్తా మాజీ సిఎంపై ఎదురుదాడి చేశారు. కొత్త ప్రభుత్వం ఏమి చేయాలో ఉపన్యాసం ఇవ్వవద్దని, మీ సంగతి చూసుకోండని ఆతిశీని సిఎం కోరారు. 'ఇది మా ప్రభుత్వం, అజెండా మాదే. మమ్మల్ని పని చేయనివ్వండి. ఆమె ప్రతి విషయమూ మాకు సూచించవలసిన అవసరం లేదు. అధికారంలో ఉన్నప్పుడు ఆమె చేయవలసిందేదో ఆమె చేసింది' అని రేఖా గుప్తా సమావేశం అనంతరం విలేకరులతో చెప్పారు. ఆతిశీపై ఢిల్లీ సిఎం మరింతగా విరుచుకుపడుతూ, 'కాంగ్రెస్ 15 ఏళ్ల పాటు పాలించింది, ఆప్ 13 ఏళ్లు పాలించింది. తాము చేసింది ఏమిటో చూసుకోవలసింది పోయి మా పాలన మొదటి రోజే ప్రశ్నలను ఎలా లేవనెత్తుతారు?' అని అన్నారు. ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను బిజెపి గుర్తు పెట్టుకుంటుండడమే ఆప్‌కు ప్రధాన సమస్య అని రేఖా గుప్తా విమర్శించారు. అర్వింద్ కేజ్రీవాల్, కాంగ్రెస్‌లను తమ తమ పార్టీలపై దృష్టి కేంద్రీకరించుకోవాలని ఆమె కోరారు. 'పార్టీలను వీడాలని కోరుకుంటున్నవారు అనేక మంది ఉన్నారు' అని ఆమె చెప్పారు. 'మేము ఇప్పుడు ఢిల్లీ గురించి ఆలోచిస్తాం. ప్రధాని మోడీ సారథ్యంలో ఢిల్లీ తన హక్కులు పొందుతుంది' అని రేఖా గుప్తా చెప్పారు. 'ఏళ్ల తరబడి పాలించిన వారు వీరే. వీరి హయాంలో అవినీతి ఘటనలు అనేకం వెలుగు చూశాయి. అసెంబీ సెషన్ తొలి రోజు కాగ్ నివేదికను సమర్పిస్తారని, పలువురి రహస్యాలు బహిర్గతం అవుతాయని వీరు భయపడుతున్నారు' అని ఢిల్లీ ముఖ్యమంత్రి విలేకరులతో చెప్పారు. బిజెపి ప్రభుత్వం ఢిల్లీలో గురువారం నిర్వహించిన తొలి క్యాబినెట్ సమావేశంలో తమ ఎన్నికల పూర్వపు కీలక వాగ్దానమైన కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని రాజధానిలో అమలు పరుస్తామని వెల్లడించింది. రేఖా గుప్తా ఆతరువాత విలేకరులతో మాట్లాడుతూ, పూర్వపు ఆప్ ప్రభుత్వ పని తీరుపై 14 కాగ్ నివేదికలను తమ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెడుతుందని తెలియజేశారు. కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ అధికారంలో ఉన్నప్పుడు వాటిని అసెంబ్లీకి సమర్పించలేదు.

# ప్రపంచ దృక్పథం ఉన్న నేతలు అవసరం



న్యూఢిల్లీ : భారతీయ మనస్తత్వంతోనే అయినా ప్రపంచ దృక్పథం గల నేతల అవసరం వివిధ రంగాల్లో దేశానికి ఉందని ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం ఉద్ఘాటించారు. ఢిల్లీలో అంతిమ నాయకత్వ శిక్షణ సంస్థ (ఎస్‌ఎల్‌యు) సమ్మేళనంలో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ, 'భారతీయ దృష్టితో అంతర్జాతీయ మనస్తత్వంపై అవగాహనతో ముందుకు సాగే వ్యక్తుల అవసరం మనకు ఉంది' అని చెప్పారు. 'ప్రపంచ భావన. స్థానిక పెంపకం' ఉన్న వివిధ రంగాల్లో నాయకుల ఆవశ్యకత ఉందని ప్రధాని ఉద్ఘాటిస్తూ, అధికార యంత్రాంగంలోనైనా, వాణిజ్య రంగంలో లేదా ఏదైనా రంగంలో భారత జాతీయ లక్ష్యాన్ని ప్రతిబింబించే నాయకత్వం కావాలని అన్నారు. ప్రపంచ వేదికపై దేశ ప్రయోజనాలను ప్రోత్సహిస్తూనే ప్రపంచ సంక్లిష్టత, అవసరాలకు పరిష్కారం కనుగొనగల నాయకత్వం ప్రతి రంగంలో కావాలని మోడీ సూచించారు. భారత్ ప్రపంచ శక్తిగా ఆవిర్భిస్తోందని, ఈ ఊపును వేగవంతం చేసే, ప్రతి రంగంలో అటువంటి విజయాలు నమోదు చేసే ప్రపంచ శ్రేణి నేతల ఆవశ్యకత ఉందని ప్రధాని అన్నారు. ఎస్‌యుఎల్ వంటి సంస్థ అటువంటి మార్పు తీసుకురాగలదని ఆయన అన్నారు. వివిధ రంగాల్లో విజయాలను సాధ్యం చేయగల మానవ వనరుల పాత్ర గురించి మోడీ ప్రధానంగా ప్రస్తావిస్తూ, సృజనకు సారథ్యం వహించగల, నైపుణ్యాలను ఉపయోగించుకోగల నాయకులు దేశంలో ఉండాలని సూచించారు. మోడీ ఈ సందర్భంగా గుజరాత్‌ను ఉదాహరణగా పేర్కొన్నారు. సహజ వనరుల కొరత కారణంగా ప్రత్యేక రాష్ట్రంగా గుజరాత్ భవిష్యత్ గురించి ప్రశ్నలు లేవనెత్తారని ఆయన గుర్తు చేశారు. అయితే, గుజరాత్ తమ నేతల కారణంగా సత్ఫలితాలు సాధిస్తోందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో వజ్రాల గని లేదని, కానీ ప్రపంచంలోని పది వజ్రాల్లో తొమ్మిడి గుజరాతీ చేతుల్లో నుంచే వెళుతున్నాయని మోడీ చెప్పారు.

# మొన్న నియంత... నేడు కమెడియన్



వాషింగ్టన్ : ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరొకసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవలే జెలెన్‌స్కీని నియంతగా అభివర్ణించిన ట్రంప్ తాజాగా ఆయనను కమెడియన్‌గా సంబోధించారు. ఆ కమెడియన్ అమెరికాతో ఏకంగా 35 వేల కోట్ల డాలర్లు ఖర్చు పెట్టించారని ట్రంప్ మండిపడ్డారు. ఈ మేరకు జెలెన్‌స్కీని ఉద్దేశించి ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, రష్యాతో మూడు సంవత్సరాలుగా సాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు ట్రంప్ చర్చలు జరుపుతారని ఉక్రెయిన్ భావిస్తోంది. ఈ క్రమంలో ట్రంప్ తీరును జెలెన్‌స్కీ జీర్ణించుకోలేకపోతున్నారు. అమెరికా చుట్టూ అబద్ధాలు, తప్పుడు సమాచారమే ఉందని ఇటీవల జెలెన్‌స్కీ వాపోయారు. ఉక్రెయిన్ సార్వభౌమత్వం కోసం తాము పోరాడుతున్నామని, తమ భూభాగంపై రష్యా దురాక్రమణను అడ్డుకుంటున్నామని జెలెన్‌స్కీ చెప్పారు. అయితే, ట్రంప్ మాత్రం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మాటలను విశ్వసిస్తూ తమ ఆవేదనను అర్థం చేసుకోవడం లేదని జెలెన్‌స్కీ అన్నారు. బైడెన్ హయాంలో అమెరికా తమకు అందజేసిన సాయాన్ని ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తరువాత నిలిపివేశారని ఆయన ఆరోపించారు. అమెరికా సాయం లేకుంటే ఉక్రెయినియన్లు ఎక్కువ రోజులు మనుగడ సాగించలేరని ఆయన అన్నారు. కాగా, రష్యా, ఉక్రెయిన్ మధ్య సాగుతున్న యుద్ధాన్ని ఎలా అయినా ముగించాలన్న లక్ష్యంతో అమెరికా దూకుడుగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలోనే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్ దూత లెఫ్టినెంట్ కీత్ కెల్లాగ్ గురువారం భేటీ అయ్యారు. ఆ భేటీ తరువాత మీడియా సమావేశంలో నేతలు ఇద్దరూ మాట్లాడవలసి ఉండగా, దానిని రద్దు చేశారు. అమెరికా విజ్ఞప్తి చేయడంతో మీడియా సమావేశాన్ని రద్దు చేసినట్లు ఉక్రెయిన్ అధికారులు తెలియజేశారు.

# టమోటాలను ఈ మూడు రాష్ట్రాలకు పంపిస్తున్నాం



అమరావతి: ఆంధ్రప్రదేశ్ టమోటాను తెలంగాణ, మధ్యప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్రకు పంపిస్తామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ టమోటా రైతులను ఆదుకునేందుకు కలెక్టర్లు, వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులతో ఎపి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతుల దగ్గర కిలో రూ. 8కి కొని రైతు బజార్లకు పంపాలని అన్నారు. ఇవాళ వెయ్యి క్వింటాళ్ల టమోటా సేకరించి నగరాలకు పంపామని తెలియజేశారు. ఎఐఎస్, నాఫెడ్, ఎన్ సిసిఎఫ్ ద్వారా రైతులను ఆదుకోవాలని అచ్చెన్నాయుడు కోరారు. పొరుగు రాష్ట్రాలకు పంపడం ద్వారా రూ. 15 వరకు ధర వస్తుందని చెప్పారు. టమోటాలను ప్రాసెసింగ్ యూనిట్లకు పంపుతున్నామని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# గీత కార్మికుల బతుకులకు ఏదీ భరోసా?



త్రేతాయుగం నుండి దేవతలు సైతం కల్లును సురాపానకంగా స్వీకరించి ఆనందాన్ని వ్యక్తీకరించి తన్మయత్వాన్ని పొందేవారు. సమాజంలో ప్రతి రంగంలో రోజురోజుకి ఎన్నో మార్పులు చోటుచేసుకుని నవశకానికి నాంది పలుకుతుంటే ఒక్క గీత కార్మికుల బతుకుల్లో మాత్రం మార్పు లేకపోవడం బాధాకరం. పాలకులు, ప్రభుత్వాలు మారినా గీత కార్మికుల జీవన విధానంలో విలక్షణమైన మార్పులు రావడం లేదు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతుకు పోరాటమే భవితగా ముందుకు సాగుతున్న ఈ జాతికి భరోసా ఇచ్చేవారెవరు? కుటుంబ బాధ్యతలే పరమావధిగా బాధలు ఎన్ని ఉన్నా భరిస్తూ కులవృత్తిని నమ్ముకున్న ఈ కష్టజీవులను ఆదరించే దిక్కెవరు? తరాలు మారుతున్నా గీతకార్మికుల తలరాతలు మారడం లేదనడానికి ఎన్నో సంఘటనలు మన ముందు కదలాడుతున్నాయి. రెక్కాడితేగానీ డొక్కాడని వీరి జీవితాలు ప్రతిక్షణం కత్తిమీద సాము లాంటివి. ఆత్మగౌరవం తోడుగా ధైర్యమే దోస్తీగా కులవృత్తి జీవన భృతిగా సాగుతున్న వీరి బతుకులకు రక్షణ కరువైందని చెప్పవచ్చు. ఎన్నికల సమయంలో స్వార్థపూరిత ఆలోచనలతో, అవసరానికి వాడుకునే ఆటబొమ్మల మాదిరిగా చూస్తూ గీత కార్మికుల ఓట్ల కోసం పాకులాడే పాలకులు తప్ప గౌడన్నల సంక్షేమానికి దారి చూపేవారు కానరారు. జిఒల పేర్లతో, సర్క్యులర్ల సాకుతో కాలక్రమంగా గీత వృత్తి ఉనికిని దూరం చేస్తున్నారే తప్ప వృత్తి పరిరక్షణకు, ఉపాధి కల్పనకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు అనడంలో సందేహం లేదని చెప్పవచ్చు. అధికారుల, పాలకుల అండతో అగ్రవర్ణాల ఆగడాలతో అమాయకపు గీతకార్మికుల జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్న వారిపై చర్యలు తీసుకునే నాథుడే లేడు. వివిధ కార్యక్రమాల పేర్లతో వృత్తి పరిరక్షణ ప్రచారం పేరుతో తాటి, ఈత వనాలు పెంచుతామని చెప్తూనే, వాటి పర్యవేక్షణ బాధ్యతను గాలికి వదిలేసి గీత కార్మికుల పట్ల పాలకులు నిర్లక్ష్యపు వైఖరిని ప్రదర్శిస్తున్నారు. పంట భూముల్లో ఉన్న తాటి, ఈత చెట్లను కొంత రుసుం చెల్లించి తొలగించుకోవచ్చనే నిబంధన గౌడన్న జీవనోపాధికి బీటలు పారేలా చేస్తుంది. ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుండి పడి దుర్మరణం చెందిన గీతకార్మికుల ఎక్స్‌గ్రేషియా మంజూరు విషయంలో కూడా నిమ్మకునీరెత్తినట్లు ఉండటమే చేస్తుంది. సంవత్సరాలు గడుస్తున్నా కుటుంబంలో ఎవరి తోడులేక, బాధ్యతాయుమైన వ్యక్తిలేక ఎంతోమంది గీత కార్మికుల కుటుంబాలకు ఇప్పటి వరకు కూడా ఎక్స్‌గ్రేషియా రాకపోవడం దురదృష్టకరం. ఇప్పుడు రాష్ట్రంలో ఉన్న ఈత, తాటివనాలకు రక్షణ దిక్కులేదు కానీ కొత్తవనాల పెంపు కార్యక్రమాలు రూపొందించడం హాస్యాస్పదం అని చెప్పవచ్చు. దాదాపు నాలుగు సంవత్సరాల క్రితం ఎక్స్‌గ్రేషియా మంజూరు చేస్తే ఇప్పటివరకు బాధిత గీతకార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇచ్చిన పాపానపోలేదు. నిర్లక్ష్యపు నీడలు వెంటాడుతూ నిరుపేద గౌడన్నల జీవితాలు అగమ్యగోచరంగా మారినా ప్రభుత్వాల మనసు మాత్రం మారడంలేదు. బడుగు బలహీన వర్గాల్లో అధిక జనాభా కలిగిన గీత కార్మికుల సంక్షేమానికి ఒక ప్రత్యేకమైన కార్యాచరణ రూపొందించి గౌడ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. గీత కార్మికుల కుటుంబంలో ఉన్న యువతకు ఉపాధి కల్పన కోసం తాడి టాపర్ బోర్డు ఏర్పాటుచేసి తాటి ఈత సంబంధిత పదార్థాల ఉత్పత్తిని చేపట్టాలి. ప్రకృతి సిద్ధంగా, సహజంగా లభించే కల్లును మార్కెట్లో అందుబాటులో ఉంచి వాణిజ్య పరిశ్రమగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలి. తాటి ఈత ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసి గీత కార్మికుల జీవనోపాధికి పటిష్టమైన కార్యక్రమాలు, పథకాలు రూపొందించాలి. వృద్ధులైన గీత కార్మికులకు తగిన మొత్తంలో పింఛన్లు ఇవ్వాలి. తాటి ఈతవనాల పెంపకానికి సంబంధించి మరుగుజ్జు రకానికి చెందిన రకాలపై దృష్టి సారించాలి. ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై పడి మరణించే పరిస్థితిని రూపుమాపడానికి నిర్ణయాత్మక ఆలోచనతో తాడిచెట్టు ఎక్కే యంత్రాలను ప్రభుత్వం తీసుకురావడం జరిగింది కానీ వాటిని పూర్తిస్థాయిలో రాష్ట్ర మొత్తంలో ఉన్న గీత కార్మికులకు అందేలా చర్యలు తీసుకోవాలి. పూర్తిస్థాయిలో అన్ని గ్రామాలకు సేఫ్టీ మోకులను అందించేలా ప్రణాళికలు రూపొందించి నిర్మాణాత్మకమైన శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి టివిఎస్ మోపెడ్లు కొనుగోలు చేసి ఇవ్వాలి. కుటుంబాలు గడవడం కష్టంగా మారి ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతూ కులవృత్తినే నమ్ముకుని జీవిస్తున్న, ఎండిన తాటి, ఈత వనాలతో కల్లు రాక నానా ఇబ్బందులుపడుతున్న గీత కార్మికులకు గౌడ స్వయం ఉపాధి సంఘాలు ఏర్పాటు చేసి వారికి ఉపాధి కల్పించాలి. బెల్టు షాపుల దెబ్బకు కల్లు అమ్ముడుపోక ఆర్థికంగా ఇబ్బందులుపడుతున్న పరిస్థితులను పాలకులు ఆలోచన చేయాలి. కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గీత కార్మికుల సంక్షేమానికై ఒక్క నూతన పథకం కూడా అమలు చేయడం లేదని గౌడన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా గీత వృత్తినే నమ్ముకుని జీవిస్తున్నా, గీత కార్మికులు చస్తే తప్ప బతకడానికి పథకాలు ఏమీ లేవు. తాటి చెట్లు ఎక్కి కల్లు గీసుకునే గీత కార్మికులు ప్రమాదవశాత్తు పడి మరణిస్తే, శాశ్వత అంగ వైకల్యం పొందిన వారికి ప్రభుత్వం రూ. 5 లక్షల బీమా నుండి 10 లక్షల వరకు వర్తింపజేయాలి. గీత వృత్తిని అభివృద్ధి చేసేందుకు సబ్సిడీ పథకాలు రూపొందించడంలో ప్రభుత్వం గౌడ కులస్థులను విస్మరించే పరిస్థితి మారాలి. మొదటి నుంచి గౌడ జాతిపై చిన్నచూపుతో ప్రభుత్వం గీత కార్మికులపై వివక్ష చూపుతుంది. ఇప్పటికైనా పాలకులు గౌడన్న బతుకులకు భరోసా ఇచ్చే కార్యక్రమాలు రూపొందించాలి.

# పోరు నష్టం.. పొందులాభం



అధికారంలోకి తాను వస్తే రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేస్తానని ప్రకటించన డొనాల్డ్ ట్రంప్, ఆ విధంగానే అమెరికా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తరువాత ప్రయత్నాలు ప్రారంభించారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని నివారిస్తానని ఒకవైపు చెబుతూనే మరోవైపు కొన్నేళ్లుగా రష్యాతో ప్రతిష్టంభించిన సంబంధాలు మళ్లీ బలోపేతం చేసుకోడానికి ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. ఈ నేపథ్యంలోనే సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని దిర్యియా ప్యాలెస్‌లో మంగళవారం (ఫిబ్రవరి 18) అమెరికా, రష్యా ప్రతినిధుల మధ్య మొదటి విడత చర్చలు జరిగాయి. ఈ శాంతి చర్చల్లో ఉక్రెయిన్ ప్రతినిధులను భాగం చేయకపోవడంపై వస్తున్న విమర్శలను బుధవారం ట్రంప్ తోసిపుచ్చారు. మూడేళ్లుగా ఈ యుద్ధం నివారణ గురించి నువ్వేం చేస్తున్నావని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీను ఉద్దేశించి ట్రంప్ ఎదురుదాడి చేశారు. అసలు ఈ యుద్ధాన్ని మొదలు పెట్టాల్సిందికాదని, ఇదో బుద్ధితక్కువ యుద్ధమని వ్యాఖ్యానించారు. జెలెన్ స్కీ నేతృత్వంలో ఉక్రెయిన్ అతిపెద్ద విధ్వంస ప్రదేశంగా మారిపోయిందని ట్రంప్ మండిపడ్డారు. ఉక్రెయిన్‌లో ఎన్నికలు నిర్వహించాల్సిందని, జెలెన్ స్కీకి కేవలం 4% మాత్రమే ప్రజామద్దతు ఉందని ఘాటుగా వ్యాఖ్యానించారు. దీనిని బట్టి యుద్ధం అంటే ఎన్ని అనర్థాలకు కారణమవుతోందో అన్న అభిప్రాయంతో ట్రంప్ ఆగ్రహంగా ఉన్నారు. సౌదీలో జరిగిన చర్చల్లో మూడు అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు. మొదటిది వాషింగ్టన్, మాస్కోల్లో దౌత్యసిబ్బందిని తిరిగి నియమించుకోడానికి, రెండవది ఉక్రెయిన్ శాంతి చర్చలకు మద్దతుగా ఉన్నతస్థాయి అధికారిక బృందాన్ని ఏర్పాటు చేయడానికి, మూడోది ఉభయదేశాల సంబంధాలను మరింత మెరుగుపర్చుకోడానికి, ఆర్థిక సహకారం పెంపొందించుకోడానికి చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో ఉక్రెయిన్ యుద్ధ నివారణ ప్రయత్నాల్లో కొంత పురోగతి కన్పిస్తుందని ఉక్రెయిన్‌తో పాటు ఐరోపా యూనియన్ దేశాలు కూడా ఎన్నో ఆశలు పెట్టుకున్నాయి. కానీ ఉక్రెయిన్ ప్రతినిధులకు ఈ చర్చల్లో చోటు కల్పించకపోవడం వివాదాస్పదమైంది. చర్చలకు ముందు పుతిన్ విదేశీ వ్యవహారాల సలహాదారు యూరీ ఉషోవ్ మాట్లాడుతూ ఈ చర్చలు పూర్తిగా అమెరికా, రష్యా దేశాల ద్వైపాక్షికమని, ఇందులో ఉక్రెయిన్ అధికార ప్రతినిధులను చేర్చుకోవలసిన అవసరం లేదని స్పష్టం చేయడం ఉక్రెయిన్ ప్రభుత్వానికి ఏమాత్రం గుర్తింపు ఇవ్వడం లేదన్న వాస్తవం బయటపడుతోంది. రష్యా బలగాలకు వ్యతిరేకంగా కీవ్ క్రమంగా తన క్షేత్రస్థాయి ఉనికిని కోల్పోతున్నట్టు కనిపించింది. ఉక్రెయిన్ శాంతి చర్చల్లో తాము ప్రాతినిధ్యం వహించకపోతే ఏ నిర్ణయం తీసుకున్నా తాము గుర్తించబోమని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ ఇదివరకే ప్రకటించారు. దీని ప్రభావం వల్లనే కావచ్చు. జెలెన్ స్కీతో చర్చలు జరిపేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ అంగీకరించారని, అవసరం అనుకుంటే వీరి మధ్య చర్చలు ఉంటాయని రష్యా ప్రకటించింది. దీనివెనుక ట్రంప్ ఒత్తిడి ఉన్నట్టు భావించవలసి వస్తోంది. జెలెన్ స్కీ ఎన్నిచేసినా నాటోలో ఉక్రెయిన్‌కు సభ్యత్వం రాదని, ఏదో ఒకనాటికి రష్యాలో ఉక్రెయిన్ కలిసిపోతుందని ట్రంప్ చేసిన వ్యాఖ్యల అంతరార్థం తెలియక పశ్చిమ యూరప్ నేతలు ఏం చేయాలో తెలియక తికమకపడుతున్నారు. ఉక్రెయిన్‌కు రక్షణ కల్పించే సాకుతో రష్యా సరిహద్దులకు నాటోను విస్తరింపచేయలన్న యూరప్ వ్యూహం ఇప్పుడు బెడిసికొట్టినట్టవుతోంది. దీనికి తోడు రష్యాతో ఉక్రెయిన్ సాగిస్తున్న యుద్ధంలో తాము అందించిన సహాయానికి లేదా ఆ ఖర్చును తిరిగి చెల్లించే స్థితిలో ఉక్రెయిన్ లేనందున దానికి బదులుగా టిటానియం, యురేనియం, లిథియం వంటి 500 బిలియన్ల విలువగల ఖనిజ సంపద ఉన్న ప్రాంతాల్లో సగం తమకు అప్పగించాలని ట్రంప్ బేరసారాలు జరుపుతున్నారు. 'పోరు నష్టం.. పొందులాభం' అన్న లక్ష్యంతో ట్రంప్ పావులు కదుపుతున్నారు. అయితే రియాద్‌లో మంగళవారం రష్యా, అమెరికా చర్చల్లో ఉక్రెయిన్ ప్రతినిధులను విస్మరించడం యూరోపియన్ యూనియన్ దేశాలు తీవ్రంగా పరిగణిస్తున్నాయి. ఈ దేశాల అత్యవసర సమావేశానికి ఫ్రాన్స్ పిలుపుఇచ్చింది. రష్యా ఉక్రెయిన్ సంధి విషయంలో యూరప్ వైఖరిని స్పష్టం చేసేందుకు ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ పారిస్‌లో యూరప్ నేతల సమావేశం ఏర్పాటు చేశారు. అంతకు ముందే బ్రిటన్ సోమవారం ఉక్రెయిన్ యుద్ధంపై చర్చించింది. ఉక్రెయిన్ ఉనికికి నష్టం కలిగిస్తే ఒప్పుకోమని అవసరమైతే తాము ఉక్రెయిన్‌కు అండదండలు అందిస్తామని హెచ్చరించింది. రష్యా ఆక్రమించుకున్న ఉక్రెయిన్ భూభాగాలను రష్యాకు కట్టబెట్టే విధంగా ఒప్పందాన్ని సహించబోమని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ స్పష్టం చేశారు. అంతేకాదు ఇప్పుడు జరుగుతున్న యుద్ధం రష్యా యూరప్ మధ్య అని ఆయన వెల్లడించడం గమనార్హం. కానీ ట్రంప్ పుతిన్ ఫోన్ చర్చల తరువాత ఐరోపాలో తర్జనభర్జన మొదలైంది. ఐరోపా దేశాలన్నిటికీ ఉన్నబలం కన్నా రష్యాకు రెట్టింపు బలం ఉంది. అందువల్ల ఐరోపా దేశాలు తొందరపడడం లేదు. ఐరోపా భద్రతకు తామికేమాత్రం ప్రాథమిక హామీదారుగా ఉండేది లేదని అమెరికా రక్షణ మంత్రి పేట్‌హెగ్‌సేత్ ప్రకటించడమే కాదు, యూరప్ తమ రక్షణ వ్యయం పెంచుకోవాలని, వారి రక్షణకు తాము బాధ్యత వహించబోమని ట్రంప్ పదేపదే హెచ్చరిస్తుండడంతో ఐరోపా యూనియన్ ముఖ్యంగా పశ్చిమ యూరప్ దేశాలు భయపడుతున్నాయి. బైడెన్ హయంలో రష్యాపై ఆంక్షలతో ఇరకాటంలో పెట్టాలనుకున్న ఐరోపా యూనియన్ దేశాలు ఇప్పుడు ఆత్మరక్షణలో పడ్డాయి.

# తేనెలొలుకు తెలుగు




దేశభాషలందు తెలుగు లెస్స అన్నారు అలనాడే శ్రీకృష్ణదేవరాయలు. శతాబ్దాల సాహిత్య చరిత్ర, భాషా చరిత్ర గల అందమైన భాష తెలుగు. దానిని ఆకళింపు చేసుకున్న జాతి తెలుగు జాతి. ప్రతి సంస్కృతి, సంప్రదయం ఎంతో అర్థవంతమైన మన సంస్కారాన్ని, ఉన్నతిని ప్రతిబింబిస్తుంది. అందుకే తోట గాలి, ఏటి నీరు, తేట తెనుగు కన్నా స్వచ్ఛమైనవి లేవంటారు మన పెద్దలు. తేటతేట తెనుగులా అంటూ తెలుగు గొప్పదనాన్ని వర్ణించాడో కవి. తెలుగు లో వచ్చిన సాహిత్యం అమూల్యమైనది. పాశ్చాత్య భాషలలో ఇటాలియన్ వంటిదని నికోలాయ్ కౌంటి వంటి వారు తెలుగును పొగిడారంటే దీని విశిష్టత అర్థం చేసుకోవచ్చు. సిపి బ్రౌన్ వంటి బ్రిటిష్ ఉన్నతాధికారులు వేమన పద్యాలు చూసి ముగ్ధులై తెలుగు అభిమానులుగా మారారు. దీన్ని మరింత అభివృద్ధి చేయడానికి రేయింబవళ్లు కృషి చేశారు. పదకోశాలు తయారు చేశారు. పూర్వం తెలుగు భాషా సౌందర్యం జనపదమై, జానపదమై, పాటై, వచనమై, పద్యమై, కవిత్వమై తెలుగుదనం పరవశించేది. పుట్టిన పాపాయి ఏడుస్తుంటే, తన కళ్లారా చూసుకుంటూ, మాతృత్వం పొంగిపొర్లుతుంటే 'ఏడవకు ఏడవకు వెర్రి పాపాయి, ఏడిస్తే నీకళ్ళ నీలాలూ కారు, నీలాలూ కారితే నే చూడలేను' అంటూ ఆ కంటి నీరు తననెంత బాధపెడుతుందో ఆ తల్లి చెబుతుంటే, ఆ తల్లి ఒడి వెచ్చదనానికో, పాటలోని మాధుర్యానికో, ఆర్ద్రతకో గాని పాపాయి నిద్రలోకి జారుకునేది. ఇంత కమ్మని భాష మన తెలుగు భాష. జ్ఞానపీఠ అవార్డును సైతం దక్కించుకున్న భాష తెలుగు భాష. 'అమ్మ' అన్న పిలుపులో అనురాగం ధ్వనిస్తుంది. 'నాన్న' అన్న పిలుపులో అభిమానం ధ్వనిస్తుంది. ఇంత మాధుర్యం సంతరించుకున్న మన భాష కొంత నిర్లక్ష్యం వల్ల ఈ తరం యువతకు, చిన్నారులకు దూరమవుతున్నది. పూర్వం తెలుగుజాతి ప్రతి దశలోనూ మాతృభాష పరిమళం అంటిపెట్టుకుని ఉండేది. పుట్టినప్పటి నుండి లాలి పాటలు, తప్పటడుగులు వేసే వేళ మురిపాల ముచ్చట్లు, చదువుకునేటప్పుడు సాంస్కృతిక సౌరభం, పెళ్లప్పుడు ప్రతీ ఘట్టం మధుర భావాల సుమనోహరమై, సమాహారమై తెలుగుదనంతో విడదీయరాని అనుబంధమై తెలుగు అక్షరమే తరగని ఆస్తిగా, కొండంత అండగా నిలిచింది, జ్ఞానమిచ్చింది, అలసట తీర్చింది, అక్కున చేర్చుకుంది. అభయమిచ్చింది. మనసు ఫలకంపై మధుర స్మృతులై వెన్నెల వెలుగులు నింపింది. అలనాటి జీవన చిత్రంలోకి వెళితే అడుగడుగునా తెలుగు భాషా పరిమళం వికసించి, జీవితమంతా రంగురంగుల హరివిల్లును చూపినంత ఆనందంతో, ప్రశాంతంగా, ఉల్లాసంగా గడచిపోయేది. జోలపాటలో రాగ రంజితమైన లాలింపు, వేదాంతార్థాలు నిక్షిప్తమై, వింటుంటే వినాలనిపించేలా ఉండి సేద తీర్చేవి. 'కస్తూరి రంగ రంగా..' అంటూ పాపాయికి పేరు పెట్టేప్పుడు, ఉయ్యాలలో వేసేటప్పుడు పాడే పాటల్లో లాలిత్యం , మధురత్వం ఏరులైపారేది. రాత్రి వెన్నెల్లో పాపాయి అన్నం తినని మారాం చేస్తే చందమామను చూపిస్తూ 'చందమామ రావే..' అంటూ పాడితే.. చందమామను చూసిన పరవశానికో, అందులోని తెలుగు తేటదనానికో చక్కగా బువ్వతినేవారు పిల్లలు. నేటి ఆకాశ హర్మ్యాల వంటి అపార్టుమెంట్లలో ఎంతమంది చందమామను చూస్తున్నారు? ఇంకా చిన్నచిన్నగా పాఠశాలకు పంపించే నేపథ్యం లో ఎన్నో ఆటలు, పాటలు అందులో ఎన్నో అర్థాలు మానసిక పరిణతి కలిగేలా ఉండేవి. 'చిట్టి చిలకమ్మ..', 'చిట్టిచిట్టి మిరియాలు..', 'దాగుడు మూతల దండ కోర్..', 'వీరి వీరి గుమ్మడి పండు..', 'ఒప్పులకుప్పవయ్యారి భామ..', 'తారంగం తారంగం..' అని ఇలా పద్యం గాని, పాట గాని ఎంతో పరవశం కలిగేలా మనసుకి హాయిగొలిపేలా ఉండి నీతిని, విజ్ఞానాన్ని అంతర్లీనంగా ప్రతిబింబించేవి. 'కాళ్ళగజ్జె కంకాలమ్మ..'లో ఔషధాలకు సంబంధించిన విజ్ఞానం, 'చింతకాయ దప్పడం, పప్పేసి కలపడం, కంఠమెల్ల మెక్కడం, కడుపు నొప్పి రావడం..', ఎక్కువ తింటే కడుపునొప్పని చెప్పకనే చెప్పడం, ఇంకా ఒకటి ఓ చెలియా.. రెండు రొకళ్ళు.. మూడు ముచ్చిలక.. నాలుగు నందన్న..' అంటూ అంకెలు ఆటలతోనే నేర్పడం జరిగేవి. తెలుగు చదువు కేవలం విజ్ఞానాన్ని పెంపొందించేలా మాత్రమేకాక వ్యక్తిత్వ వికాసానికి, జీవించడానికి కావలసిన తెగింపు సమకూరుస్తుంది. 'పలువురెదుట నిలిచి భాషింప భయమేల తెలుగు బిడ్డ' అంటూ ధైర్యాన్ని నూరిపోస్తుంది. 'ధైర్యే సాహసే లక్ష్మీ' అనుకుంటూ ఆత్మవిశ్వాసం ప్రతిబింబించేలా దీటుగా మాట్లాడేలా చేస్తుంది. పెరిగాకా కూడా ఆ తెలుగుదనంలోని నుడికారం అడుగడుగునా ప్రతిఫలిస్తూ పరవశాన్ని కలుగచేసేది. భాష ఒకటిగా ఉన్నప్పుడే జాతి ఒకటిగా ఉంటుంది. భాష కనుమరుగైతే, సంస్కృతి దూరమవుతుంది. భాష, సంస్కృతిలేని జాతి క్రమంగా సహజ లక్షణాలు కోల్పోతుంది. ఒకప్పటి మాట ఎలా ఉన్నా ప్రస్తుతం తెలుగు ప్రచుర్యం, ప్రాముఖ్యత కొంత తగ్గింది. తెలుగు జాతి మనది నిండుగా వెలుగు జాతి మనది అన్నట్లు అందరూ గర్వంగా చెప్పుకునేటట్లు.., మా తెలుగు తల్లికి మల్లెపూదండతో పాటు తెలుగు జిలుగుల వెలుగుహారం వేయాలి. సహజంగానే ప్రతీ తెలుగు వాడి భావితరాల మనస్సుల్లో 'తెలుగు', పూలు వికసింప జేయాలి. నవ తెలుగు భాష సౌందర్యాన్ని, పరిమళాన్ని నలుదిశలా వెదజల్లాలి. పల్లెల్లో పాడుకునే పద్యాలు, జానపద గేయాల కమ్మదనాన్ని, తియ్యదనాన్నీ తరతరాల సంపదగా రేపటి పౌరులకి అందించాలి. పురాతన కాలం నుండి ఎన్నో మార్పులు చేర్పులు, కాలంతో ఎన్నో తీయని జ్ఞాపకాలను, చమత్కారాలను తనలో నిక్షిప్తం చేసుకుని లేతమైన తియ్యటి తేనెలాంటి తెలుగును, పొదుపు కథలుగా, కవితలుగా, కావ్యాలుగా, కథలుగా రేపటి పౌరులకు నాటికలుగా, నవలలుగా పరివర్తనం చెంది వారసత్వ సంపదగా అందించాలి.